NIZAMABAD EDITION

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నిజామాబాద్ | సోమవారం 29 జూన్ 2026 | సంపుటి : 16 | సంచిక : 137 | పేజీలు : 8 | వెల : 1/- | RNI No. TELTEL/2010/35558

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

శ్రీ పరాభవ నామ సంవత్సరం, జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం పౌర్ణమి, విడవాహ స్వర్ణము, జ్యేష్ఠ స్వర్ణము సూర్యోదయం: 5:29 సూర్యాస్తమయం: 6:32 చంద్రోదయం: 6:10 చంద్రాస్తమయం: లేదు, తిథి: పౌర్ణమి త. 4:16 వరకు, తదుపరి పాడ్యమి, నక్షత్రం: మూల త. 3:48 వరకు, తదుపరి పూర్వాషాఢ, యోగం: శుక్లం మ. 2:59 వరకు, తదుపరి బ్రహ్మం, కరణం: భద్ర మ. 3:16 వరకు, తదుపరి బవ త. 4:16 వరకు, తదుపరి బాలవ

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# అక్రమ రవాణా



**ఇందిరమ్మ ఇండ్ల కోసమంటూ తరలింపు**

**అనుమతులు లేక గాడిదల ద్వారా ఇసుకను తెప్పించుకుంటున్న కొందరు లబ్ధిదారులు**

**పట్టించుకోని సంబంధిత అధికారులు**

నిజాంసాగర్

నిజాంసాగర్ మండల పరిధిలోని మంజీరా పరీవాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతున్నది. మండలంలోని అచ్చంపేట, మాగి గ్రామ శివారు ప్రాంతాల నుంచి కొన్ని రోజులుగా ఎలాంటి అనుమతులూ లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. మాగి గ్రామ శివారు నుంచి ఇందిరమ్మ ఇండ్ల పేరుతో నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఇతర గ్రామాలకు తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక వైపు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇసుక అనుమతులు లభించక ఇబ్బందులు పడుతుంటే , మరో వైపు అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం తేడా లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. సెలవు రోజుల్లో అధికారుల పర్యవేక్షణ తక్కువగా ఉంటుందనే ఉద్దేశంతో ఇసుకను పెద్దమొత్తంలో తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు అనుమతులు లభించకపోవడంతో గాడిదల ద్వారా ఇసుకను తెప్పించుకుంటున్నారు. 50 గాడిదల ఇసుక తీసుకువస్తే ఒక ట్రాక్టర్ లెక్కన గాడిదకు వంద రూపాయలు, ఈ లెక్కన ట్రాక్టర్‌కు రూ.5వేలు చెల్లించి ఇసుకను తెప్పించుకుంటున్నారు. ఈ విషయమై మాగి జీపీవో సాయిబాబాను వివరణ కోరగా, ఇసుక రవాణా విషయం తన దృష్టికి రాలేదని సెలవు రోజుల్లో ఇలా జరుగుతున్నదని తెలిపారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి నిజమైన లబ్ధిదారులకు ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

# తెలంగాణ ప్రజలకు రక్షణ కవచం బీఆర్ఎస్

**పోలీసు పహారాలో పాలన సాగిస్తున్న రేవంత్‌రెడ్డి**


**బీఆర్ఎస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి**

బాన్సువాడ



రేవంత్ రెడ్డి పోలీసుల పహారాలో పాలన సాగిస్తున్నాడని బీఆర్ఎస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఎక్కడ ఎన్నికలు ఉంటే అక్కడ 'సర్'ను ప్రవేశపెట్టి .క్రిస్టియన్, ముస్లిం ఓట్లను గల్లంతు చేసే అవకాశం ఉన్నదని తెలిపారు. తమకు అనుకూలంగా లేనిచోట్ల ఓటర్లను తొలగిస్తున్నదని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేసిందని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజానీకానికి రక్షణ కవచం బీఆర్ఎస్ పార్టీ అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని బుడ్డర్ ఖాన్ రేవంత్ రెడ్డి పరిపాలిస్తున్నాడని ఎద్దేవా చేశారు.

- మిగతా 2లో




# పల్లె దవాఖానల్లో వెక్కిరిస్తున్న ఖాళీలు!

**పోతంగల్ పీహెచ్‌సీ పరిధిలో 9 మంది ఏఎన్ఎంలు, ఇద్దరు సూపర్‌వైజర్లు బదిలీ**


**ఇప్పటివరకూ భర్తీ చేయని వైనం**

**వానకాలం వ్యాధులు ప్రబలే అవకాశం**

**రోగులకు అందని మెరుగైన వైద్య సేవలు**

3

# ఆర్వోబీ ఇంకెన్నాళ్లు





**దొందూ దొందే అన్నట్లుగా జాతీయ పార్టీలు**

**బీఆర్ఎస్ హయాంలో వేగంగా ఆర్వోబీ పనులు**

**మాధవనగర్ వంతెన పట్ల బాధ్యత మరిచిన నేతలు**

**కేసీఆర్ పరిపాలనలోనే రూ.63కోట్లు నిధులు విడుదల**

**కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధుల విడుదలలో తీవ్ర జాప్యం**

**సోషల్ మీడియా పోస్టులకే పరిమితమైన ఎంపీ అర్వింద్**

**రేవంత్ సర్కారు తీరును ఎండగట్టడంలో బీజేపీ వైఫల్యం**

వివరాలు 3లో..

# బోధన్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులను పెంచాలి





**సిపిఎం నాయకుల డిమాండ్.**

**ప్రజా జ్యోతి బోధన్ జూన్27 :** బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి వైద్యులతో సంప్రదించి మాట్లాడారు. అనంతరం వివిధ వార్డుల్లో ఉన్న రోగులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ బోధన్ ఏరియా హాస్పిటల్ ను జిల్లా ఆసుపత్రిగా మార్చినప్పటికీ కనీసం ఏరియా హాస్పిటల్ లో ఉండే వైద్య సిబ్బంది కూడా లేకపోవడంతో ఆసుపత్రి కి వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్స కోసం ప్రైవేట్ హాస్పటల్, జిల్లా కేంద్ర ఆస్పత్రికి పంపుతున్నారని అన్నారు. హాస్పిటల్ కి వచ్చే పేద మధ్యతరగతి మహిళలు గర్భిణీలు బాలింతలకు వైద్య చికిత్స అందించటానికి గైనకాలజిస్ట్ లేరని అదేవిధంగా ఎముకల డాక్టర్లు లేరని కనీసం స్కానింగ్ తీయడానికి టెక్నీషియన్ లేరని అందువల్ల వచ్చిన రోగులకు కూడా అనేకమందికి కొన్ని మందులు ఇచ్చి పంపించేస్తున్నారని వాపోయారు. దాని మూలంగా అనేకమంది రోగాలు ప్రైవేట్ హాస్పటల్ వెళ్లి లక్షల రూపాయలు ఖర్చులు పెట్టి అప్పుల పాలవుతున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా జిల్లా ఆసుపత్రి స్థాయిని పెంచడంతోపాటు వైద్య సిబ్బందిని, టెక్నీషియన్లను, మందులను, సరిపడా ఏర్పాటు చేయాలన్నారు. లేని ఎడల ఆందోళన చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో సిపిఎం ఏరియా కార్యదర్శి శంకర్ గౌడ్, కార్యవర్గ సభ్యులు యేషాల గంగాధర్, జంగం గంగాధర్, నాయకులు రాములు, నాగలక్ష్మి, అర్జున్, కార్యకర్తలు ఉన్నారు.

## బోధన్ పట్టణంలో ఒకటో వార్డులో చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన సూపర్వైజర్ ఏ సుధారాణి..





**ప్రజా జ్యోతి బోధన్. జూన్ 28..** నిజాంబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఒకటో వార్డు ఆచనపల్లిలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైద్యాధికారి. సుధారాణి ఏఎన్ఎం కే.సావిత్రి వాలంటీర్స్.మీనాక్షి మమత. వైద్య సిబ్బంది ఈ పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలని ఆమె అన్నారు. పల్స్ పోలియో వేయడం వల్ల చిన్న పిల్లలకు అంగవైకల్యం రాకుండా ఉంటుందని అలాగే రెండు చుక్కలు వేస్తే వారి యొక్క జీవితంలో ఆరోగ్యంగా ఉండటం కొరకు ఈ పల్స్ పోలియో చుక్కలు వాడుతారని దీని వల్ల పిల్లలకు ఎటువంటి అనారోగ్య పాలు కాకుండా కాపాడుతుందని. వైద్యాధికారి సూపర్వైజర్ ఏ సుధారాణి తమ సిబ్బందితో కలిసి ఆచన్ప ల్లిలోపల్స్ పోలియో చుక్కలు చిన్నపిల్లలందరికి వేయడం జరిగింది. ఈ పల్స్ పోలియో చుక్కలు వేసుకున్న చిన్నారులకు జీవితంలో అంగవైకల్యం రాకుండా కాపాడుతుంది

## బిఎల్ఓ లు బాధ్యతగా పనిచేయాలని ఇందల్వాయి ఎమ్మార్వో జి బాలయ్య





**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) జూన్. 28** ఇందల్వాయి మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామపంచాయతీ పరిధిలోని ఇందల్వాయి గ్రామంలో ఎనిమి రేషన్ వారాల పంపిణీ కార్యక్రమం చేపట్టిన ఎమ్మార్వో జీ బాలయ్య ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే అధికారులు కృషి చేయాలని అందల్వాయి మండల తాసిల్దార్ ఎమ్మార్వో జి బాలయ్య అన్నారు. ఆదివారం సెలవు రోజైన విధులకు ప్రాధాన్యత ఇస్తూ మండల కేంద్రంలో ఇందల్వాయి తండాలో నిర్వహిస్తున్న ఎనిమి రేషన్ పారాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా స్వయంగా పాలన అందజేసి అనంతరం అక్కడ నిధులు నిర్వహిస్తున్న బిఎల్వోలు సూపర్వైజర్లతో సమావేశమై పంపిణీ ప్రత్యేక వేగవంతం చేయాలని పారదర్శకంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను ప్రతి ఉద్యోగి నిబంధనతో నిర్ధారించాలని ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పారాల పంపిణీ పూర్తి చేయాలని ఎమ్మార్వో బాలయ్య ఆదేశించారు ప్రతి ఒక్కరికి ఫారాలు అందేలా అధికారులు చేతుల స్థాయిలో సమన్యాయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇందల్వాయి గ్రామ సర్పంచ్ లోకని గంగమని గంగారాం ఇందల్వాయి తండా సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు సుదర్శన్ నాయక్ బాలగంగారం బాల నారాయణ జిపిఓ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు

## టాక్లి లో పిడుగు పడి రెండు గేదెలు మృతి



**కోటగిరి :** పోతంగల్ మండలం టాక్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఇదే సమయంలో ఉరుములు మెరుపులతో పాటు పిడుగు పడడంతో రెండు గేదెలు మృతి చెందినట్లు బాధితుడు చిక్లే ప్రకాష్ రావు తెలిపారు. ఆదివారం సాయంత్రం టాక్లి గ్రామంలో చిక్లే ప్రకాష్ రావు ఇంటి సమీపంలో అతనికి చెందిన రెండు గేదెలు కట్టేసి ఉన్నాయి. సాయంత్రం సమయంలో ఉరుములు మెరుపులతో పాటు ఒక్కసారిగా పిడుగు పడడంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయని బాధితుడు వాపోయాడు. రెండు గేదెలు కూడా నిండు చూడి ఉన్నాయని ఒక్కో గేదె ధర రూ.90వేలకు పైగా ఉంటుందనీ సుమారు రెండు గేదెలు కలిపి రూ.2 లక్షలు ఉంటుందని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. పిడుగుపాటుకు జరిగిన నష్టంకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

## పోలియో రహిత భారత్ కోసం కృషి చేయాలి సర్పంచ్ లచ్చావార్ సుహాసినినితిన్.



**రెంజల్, జూన్ 28(ప్రజాజ్యోతి ):** రెంజల్ మండలం లోని సాటాపూర్ గ్రామం లో గల గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ లచ్చావార్ సుహాసినినితిన్ పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం చేపట్టిన కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొని వారి చేతుల మీదుగా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ప్రతి 5సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో రహిత భారత్ కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబెర్స్ దెబ్బడ రాజు,సాబీత్,ఆశా వర్కర్లు, గ్రామస్తులు అనిల్,వైద్య సిబ్బంది, ఏ ఎన్ ఎం జమున, ఆశవర్కర్లు,తదితరులు ఉన్నారు.

## ఇందల్వాయి లో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం




**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) జూన్.28** ఇందల్వాయి పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఇందల్వాయి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఆదివారం ఐదేళ్ల లోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు ఈ కార్యక్రమానికి గంగారం తండా గ్రామ సర్పంచ్ సంగీత దిలీప్ ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంగీత దిలీప్ మాట్లాడుతూ ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు పోలియో రహిత భారత దేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా ఈ కార్యక్రమం భాగస్వాములు కావాలని ఆమె కోరారు ఇంట్లో ఉన్న ప్రతి చిన్నారి పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల రాణి ఆశ వర్కర్ జ్యోతి అంగన్వాడీ టీచర్ శారద కాజా ప్రతి ఒక్కరు పాల్గొన్నారు

# తెలంగాణ ప్రజలకు రక్షణ కవచం బీఆర్ఎస్

-మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేసిన రైతులను యూరియా యాప్ పేరిట తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతుల అవసరం మేరకు యూరియా సొసైటీల్లో అందుబాటులో ఉండేదని గుర్తుచేశారు. రేవంత్ పాలన యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో ప్రజాహంతకుడిగా రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతాడన్నారు. బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం వందల కోట్ల నిధులు మంజూరుచేసిందని తెలిపారు. పోచారం శ్రీనివాసరెడ్డికి కేసీఆర్ ఏం తక్కువ చేశారని, అడిగింది ఇచ్చారని, అడుగనిది కూడా ఇచ్చారని గుర్తుచేశారు. ఉమ్మడి జిల్లాకు వచ్చే నిధుల్లో 50శాతం నిధులు పోచారంపై గౌరవంతో ఇచ్చాడని తెలిపారు. అలాంటి గొప్పనాయకుడు కేసీఆర్‌ను పోచారం మోసం చేశాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. పోచారం మళ్లీ బీఆర్ఎస్‌లోకి వస్తున్నాడని వారి మనుషులు చెప్పుకుంటున్నారని, అది ఎట్టిపరిస్థితుల్లో జరగదని, ఎవరు రానివ్వరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మొరం అక్రమ దందా జోరుగా సాగుతున్నదని, కొంత మంది ఇందిరమ్మ ఇండ్ల పేరిట బిల్లులు మెక్కుతున్నారని ఆరోపించారు.

## పోలియో రహిత భారత్ కోసం కృషి చేయాలి...



**ప్రజా జ్యోతి బోధన్ జూన్ 28....** బోధన్ పట్టణంలోని 29వ వార్డులో గల ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం చేపట్టిన కార్యక్రమంలో ఆర్డీఓ విజయకుమారి, మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి లు పాల్గొని వారి చేతుల మీదుగా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రతి 5సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో రహిత భారత్ కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ కమీషనర్ జాదవ్ కృష్ణ, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాషా, పావులూరి నాగవేంద్ర, బీజేపీ నాయకులు పవన్, జిల్లా ఉప వైద్యాధికారి సమత రాకేష్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా.దివ్య, డా. విఠల్ రాజు, వైద్య సిబ్బంది ఉన్నారు.

## రెంజల్‌లో గ్రామదేవతలకు మహాభిషేకం



**రెంజల్,జూన్ 28 (ప్రజాజ్యోతి):** రెంజల్ మండల కేంద్రం లోని రెంజల్ గ్రామంలో గ్రామదేవతలకు శుక్రవారం గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో గంగ నీటితో మహాభిషేకం నిర్వహించారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య గ్రామదేవతలకు గంగనీళ్లతో మహాభిషేకం చేసి సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుపతి లలితబుజ్జి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామాభివృద్ధితో పాటు ప్రజలందరికీ శుభం కలగాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చీలం మానసరాకేష్ రెడ్డి, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు శేఖర్, శంకర్, పోశెట్టి, రాజు గ్రామ పెద్దలు యువకులు, మహిళలు,తదితరులతో పాటు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సర్ ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్



**ప్రజా జ్యోతి బోధన్ జూన్ 28...** చందూర్ మండలంలో పలు గ్రామాలలో కొనసాగుతున్న సర్ ప్రక్రియను ఆదివారం మండల తహశీల్దార్ వీర్ సింగ్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ ప్రక్రియను పరిశీలించి సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లు ప్రభాకర్,బాస్కర్, బిఎల్ఓ,జిపివో లు పాల్గొన్నారు.

# ఆర్వోబీ ఇంకెన్నాళ్లు

నిజామాబాద్

మాధవనగర్ రోడ్డు ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మాణం విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రెండూ దొందూ దొందే అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. నిజామాబాద్ నగర వాసుల ఇక్కట్లు తొలగించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చూపిన ఆసక్తి, పట్టింపుతనం అధికారంలో ఉన్నటువంటి కాంగ్రెస్, బీజేపీ పార్టీ నేతలకు కనిపించడం లేదు. ఆర్వోబీ నిర్మాణ పనులు నెమ్మదించడానికి మొదటి కారణం బీజేపీ పార్టీ అయితే రాష్ట్రంలో అధికారం చలాయిస్తున్న కాంగ్రెస్ పార్టీ రెండో ముద్దాయిగా నిలుస్తోంది. మాధవనగర్ పైవంతెన తాత్సారంపై ప్రజల్లో వ్యతిరేకత పెరగడంతో బీజేపీ ఎంపీ పనితీరు వెలుగు చూస్తోంది. రెండుసార్లు ఎంపీగా గెలిచి ఏం సాధించావ్? అంటూ అర్వింద్‌ను నగరవాసులు అడుగుతుండటంతో కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నారు.

చీటికి మాటికి కేసీఆర్‌పై, బీఆర్ఎస్ పార్టీపై విషం కక్కడానికి సమయం కేటాయించే నిజామాబాద్ ఎంపీకి రేవంత్ ప్రభుత్వంపై మాటెత్తడానికి ధైర్యం సరిపోవడం లేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. కేసీఆర్ చేపట్టిన ప్రాజెక్టును నిలిపేయడం, కేసీఆర్ పథకాలను ఆపేయడానికి ఉత్సాహం చూపుతోన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్వోబీకి గ్రహణం పట్టుకున్నట్లైంది. ఇచ్చిన నిధులు సకాలంలో చెల్లించకపోవడంతో నిర్మాణం ఆగింది. జూన్ నెల నాటికి రూ.3కోట్లు బిల్లులు కాంట్రాక్టర్‌కు నిలిచి పోయినట్లుగా బీజేపీ ఎంపీ ఫేస్‌బుక్ పోస్టులో వివరించాడు. అదే నిజమైతే కాంగ్రెస్ పాలకులు వివరణ ఇవ్వాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. బీజేపీ తప్పిదాలను నిలదీయాల్సిన అవసరం ఉంది. కానీ అలాంటిదేమీ కానరాకపోవడంతో అనుమానాలకు తావిస్తోంది.

**జాతీయ పార్టీల ఫక్తు రాజకీయం..**

కాంగ్రెస్, బీజేపీలకు ఫక్తు రాజకీయమే పరమావధిగా పని చేస్తున్నాయి. ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. నగరవాసుల మేలుకై పాటుపడటం లేదు. మాధవనగర్ ఆర్వోబీ ఇందుకు తార్కాణంగా నిలుస్తోంది. రూ.63కోట్లు నిధులిచ్చి ప్రచారం చేసుకోలేకపోయిన బీఆర్ఎస్ పార్టీ... 2023, డిసెంబర్ వరకు వేగంగా పనులు చేపట్టింది.

కానిప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నాయి. ఇరు





పార్టీ నేతలు ఈ బ్రిడ్జి నిర్మాణంపై సరైన రీతిలో ఆసక్తి చూపడం లేదు. పరస్పర ఆరోపణలకే పరిమితం కావడం మినహా నిధులు తెచ్చి ఆర్వోబీ పూర్తి చేయించడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడుగడుగునా అడ్డు తగిలింది. నిధులు విడుదలలో జాప్యం వహించింది. ఫలితంగా కేంద్రం సహకరించాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు స్వయంగా ధర్నాలు చేయాల్సి వచ్చింది. నేడు రాష్ట్రం సహకరించడం లేదంటూ బీజేపీ పార్టీ నేతలు, ఎంపీ అర్వింద్ చెప్పుకుంటున్నారు. వాస్తవానికి కేసీఆర్ మంజూరు చేసిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయడం లేదు. ఈ విషయంపై బీజేపీ ఎంపీ తనదైన్నైస్టైల్‌లో ఆరోపణలు గుప్పించడం లేదు. సుతిమెత్తగా ఆరోపణలు చేస్తూ పూట గడుపుతున్నారు. కేసీఆర్‌పై విమర్శలు చేసేందుకు బట్టలు చించుకుని మాట్లాడే అర్వింద్‌కు రేవంత్ సర్కారును నిలదీసేందుకు నోరు రావడం లేదా? అని స్థానిక ప్రజలు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. అప్పుడలా? ఇప్పుడిలా? ఎందుకు ఫక్తు రాజకీయాలు చేస్తున్నారని అడుగుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే బీజేపీ సర్కారు సహకరించి ఉంటే ఇప్పటికే రాకపోకలు మొదలు అయ్యేవి. బీజేపీ పాలిత రాష్ట్రం కాకపోవడంతో నరేంద్ర మోడీ ప్రభుత్వం కక్ష కట్టి రైల్వే పై వంతెన నిర్మాణానికి తగు రీతిలో సహకరించలేదు. కేవలం తూతూ మంత్రంగా రూ.30 కోట్లు మాత్రమే భరించి చేతులు దులుపుకుంటోంది.

## పల్స్ పోలియో కార్యక్రమం ముమ్మరంగా నిర్వహణ



**భిక్కనూరు :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భిక్కనూరు పరిధిలోని అన్ని గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ముమ్మరంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ జి.వి. రమణ, జాయింట్ డైరెక్టర్ (క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్), జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటి, సునీల్ రాజ్ సీహెచ్‌వో తదితరులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు భిక్కనూరు బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ట్రాన్సిట్ టీమ్‌ను, ఎస్సానపల్లి, పెద్దమల్లారెడ్డి గ్రామాల్లోని పోలియో బూత్‌లను పరిశీలించారు. అలాగే హైరిస్క్ ప్రాంతంగా గుర్తించిన పౌల్ట్రీ ఫారంలో ఉన్న చిన్నారులకు జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.వి. రమణ స్వయంగా పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, హైరిస్క్ ప్రాంతాల్లోని పిల్లలను కూడా వదలకుండా ప్రతీ చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

## సహకార రంగంలో ఆదర్శంగా 'శ్రీ రామలింగేశ్వర' సమితి

**14వ వార్షికోత్సవ మహాసభ ఘనంగా నిర్వహణ**

**సమితి అధ్యక్షులు గుంటుక జగన్మోహన్ రెడ్డి అధ్యక్షత జరిగిన సమావేశం**

**హాజరైన సమితి సభ్యులు, నిర్వాహకులు**

**షాద్ నగర్ :** షాద్ నగర్ పట్టణంలోని స్థానిక ఏబీ కన్వెన్షన్ హాల్‌లో శ్రీ రామలింగేశ్వర పరస్పర సహాయక సహకార సంఘాల సమితి 14వ వార్షికోత్సవ మహాసభ ఘనంగా జరిగింది. సమితి అధ్యక్షులు గుంటుక జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సహకార రంగ నిపుణులు, ప్రముఖులు, సహకార భారతి తెలంగాణ ప్రాంత అధ్యక్షులు యెక్కటి ఉపేందర్ రెడ్డి, రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ తెలంగాణ ప్రాంత కార్యనిర్వాహకులు కాచం రమేష్, ఇంపాక్ట్ ఫౌండేషన్ మోటివేటర్ నివేదిత, సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నాగిళ్ళ కుమారస్వామి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ?ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. సమితి పరిధిలోని 51 సభ్య సంఘాల ద్వారా సుమారు 12 వేల మంది సభ్యులకు మెరుగైన ఆర్థిక సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రూ. 32 కోట్ల పొదుపులు, రూ. 34 కోట్ల రుణాల పంపిణీతో సమితి ఆర్థికంగా బలోపేతమై ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. సభ్యులకు పొదుపు పథకాలు, సురక్ష, అప్పు విముక్తి హామీ పథకాల ద్వారా ఆర్థిక భద్రత కల్పిస్తున్నట్లు వివరించారు. సహకార ఉద్యమ బలోపేతానికి సభ్యులందరూ ఐక్యంగా కృషి చేయాలని, పారదర్శకతతో సమితిని మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లాలని ముఖ్య అతిథులు పిలుపునిచ్చారు.

# పల్లె దవాఖానల్లో వెక్కిరిస్తున్న ఖాళీలు!




## పొతంగల్ పీహెచ్‌సీ పరిధిలో 9 మంది ఏఎన్‌ఎంలు, ఇద్దరు సూపర్‌వైజర్లు బదిలీ

## ఇప్పటివరకూ భర్తీ చేయని వైనం

## వానకాలం వ్యాధులు ప్రబలే అవకాశం

## రోగులకు అందని మెరుగైన వైద్య సేవలు

కోటగిరి, జూన్ 27: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో పల్లెల్లో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానల్లో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉండడంతో రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడంలేదు. వానకాలం వచ్చేసింది.. వర్షాలు కురిస్తే వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నది. ఇలాంటి సమయంలో పొతంగల్ పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) పరిధిలోని 11 సబ్ సెంటర్లలో విధులు నిర్వర్తించే 9 మంది ఏఎన్‌ఎంలు బదిలీ అయ్యారు. కానీ వారి స్థానంలో కొత్తగా ఏఎన్‌ఎంలు రాలేదు.. అప్పటి నుంచి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వారి స్థానంలో ఉన్న వాళ్లతోనే డిప్యూటేషన్‌తో నడిపిస్తున్నారు. వీరితోపాటు ఇద్దరు సూపర్‌వైజర్లు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కూడా పోస్టులు భర్తీ కాలేదు. పల్లెల్లో ఏఎన్‌ఎంలు లేకపోవడంతో వైద్య సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొతంగల్ (బీ) సబ్ సెంటర్‌లో ఉన్న ఇద్దరు ఏఎన్‌ఎంలు బదిలీ అయ్యారు. అక్కడ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొత్తగా ఏఎన్‌ఎంలు రాకపోవడంతో పల్లె దవాఖానలో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుంకిని పల్లె దవాఖానలో ఇద్దరు ఏఎన్‌ఎంలు ఉండాల్సి ఉండగా, చాలా ఏండ్ల నుంచి ఒక్కరే ఏఎన్‌ఎం ఉన్నారు.

పాత పొతంగల్ పల్లె దవాఖాన (సబ్ సెంటర్)లో ఇద్దరు ఏఎన్‌ఎంలు ఉండాల్సి ఉండగా ఒక్కరూ కూడా లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం డిప్యూటేషన్‌తో సేవలు అందిస్తున్నారు. కల్లూర్ పల్లె దవాఖానలో ఇద్దరు ఏఎన్‌ఎంలు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారు. ఇక్కడ చాలా ఏండ్ల నుంచి పోస్టు ఖాళీగా ఉంది. ఎత్తొండ పల్లె దవాఖానలో ఇద్దరు ఏఎన్‌ఎంలు ఉండాలి. ఇప్పటికే ఒకరు బదిలీ కాగా అప్పటి నుంచి ఒక్కరే ఉన్నారు. హెగ్డోలి సబ్ సెంటర్‌లో ఇద్దరు ఉండాలి కానీ ఒక్కరే ఉన్నారు. ఒకరు గతేడాది బదిలీ కాగా అప్పటి నుంచి పోస్టు ఖాళీగా ఉంది. రాణంపల్లి సబ్ సెంటర్‌లో ఇద్దరు ఉండాలి, కానీ అక్కడ ఒక్కరు కూడా లేరు. వైద్య సేవలు ఎలా అందిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**ఇద్దరు సూపర్‌వైజర్లు బదిలీ.. రెండు ఎంఎల్‌హెచ్‌పీ ఖాళీ..**

పొతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇద్దరు సూపర్‌వైజర్లు ఉండే వారు,. ఇటీవల వారు కూడా ఉద్యోగోన్నతిపై ఇతర చోటికి బదిలీ అయ్యారు. అప్పటి నుంచి రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏఎన్‌ఎంలపై పర్యవేక్షణ చేయాల్సిన పర్యవేక్షకులు (సూపర్‌వైజర్లు)లేకపోతే వైద్య సేవలు అందేది ఎలా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. పీహెచ్‌సీ పరిధిలో ముగ్గురు సూపర్‌వైజర్లు ఉం డాలి. కానీ ఒక్కరే ఉన్నారు. మిగతా రెండు పోస్టులు ఖాళీ ఉన్నాయి. కొత్తపల్లి, సుంకిని రెండు పల్లె దవాఖానలో ఇద్దరు ఎంఎల్‌హెచ్‌పీలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్య సిబ్బంది కొరత ఉంటే రోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని మండలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది కొరత కారణంగా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడానికి కూడా ఆస్కారం లేకుండా పోయింది.

**పనిభారం పెరిగింది..**

పల్లె దవాఖానలో(సబ్ సెంటర్)లో ఏఎన్‌ఎం పోస్టు లు ఖాళీ కావడంతో పనిభారం పెరిగిందని సెకండ్ ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏండ్ల తరబడి సింగిల్ సెకండ్ ఏఎన్‌ఎంలు పని చేస్తున్నారని, వారిపై పనిభారం తీవ్రంగా పడుతుందని సెకండ్ ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు.

## సంపాదకీయం

# కాశీలో మాంసాహార నిషేధం హిందుత్వమా?

సత్యం ఒక్కటే, జ్ఞానులు ఆ సత్యాన్ని బహువిధాలుగా వ్యాఖ్యానిస్తారని (ఏకం సత్ విప్రా బహుధా వదంతి) వేదం చెబుతోంది. భగవద్గీత ప్రకారం-- మనం దైవాన్ని ఏ రూపంలో, ఏ విధంగా, ఏ రీతిలో పూజించినా, దైవం ఆ రూపంలోనే, ఆ విధంగానే కరుణిస్తుంది. ఈ తత్వమే మన బహుదేవతారాధనకు మూలం. బహుళ దేవతలను పూజించడం అనేది ఒకే దేవుడు అనే సత్యానికి విరుద్ధం కాదు. ఎప్పుడైతే దైవ బహుళత్వం సిద్ధించిందో, అప్పుడే ఆచార బహుళత్వం కూడా మొదలైంది. దేవతలను కూడా సాత్విక, రాజస, తామస దేవతలుగా విభజించారు. వారి వారి గుణాలను బట్టి, అలాగే వర్ణాన్ని బట్టి ఆచార వ్యవహార వైవిధ్యం మొదలైంది. దీనినుంచే ఆగమ, తంత్ర శాస్త్రాలు అనే భేదం వచ్చింది. ఆగమం కొంత వైదికాన్ని అనుసరిస్తే, తంత్ర శాస్త్రం అవైదికం. ఆగమశాస్త్రం ప్రకారం పూజించే దేవతలకు శాకాహారం, తంత్ర శాస్త్రం ప్రకారం పూజించే దేవతలకు మద్య మాంసాలు నైవేద్యంగా పెడతారు. వైదికం, ఆగమశాస్త్రాల ప్రకారం ఏవి నిషిద్ధములో, తాంత్రికులకు అవే పవిత్రమైనవి. అస్సాంలోని కామాఖ్య దేవాలయంలో తాంత్రిక పూజా విధానం, జంతు బలులు కొనసాగుతున్నాయి. అలాగే కాశీ (వారణాసి)లో కాలభైరవ పూజ కూడా తాంత్రిక పద్ధతిలోనే కొనసాగుతూ వచ్చింది. ఇప్పటికీ కాలభైరవుడికి మద్యం నైవేద్యంగా పెట్టడం ప్రసిద్ధి. కాలక్రమంలో అక్కడ మాంస నైవేద్యం నిలిపివేశారని వినికిడి. ఇటీవల మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వారణాసి (కాశీ)లోని మాంసం, చేపల దుకాణాలను పూర్తిగా నగర శివార్లకు తరలించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం వెనుక కేవలం ఆధ్యాత్మికత మాత్రమే కాకుండా ఆర్థిక పర్యవసానాలు కూడా ఉన్నాయని, చిల్లర కొట్టు మాంసం వ్యాపారులు తీవ్రంగా దెబ్బతిన్నారని, దీనివల్ల ఆన్‌లైన్ మాంసం డెలివరీ వ్యాపారాలు (జశీతీజూశీతీష్వ వీశీఅశీజూశీశ్రీఱవం) పుంజుకుంటున్నాయని ఆర్థిక విశ్లేషకులు వాదిస్తున్నారు. సంప్రదాయం ఎప్పుడూ కేవలం సంప్రదాయంగానే మిగలదు, ఒక ఆర్థిక కోణం కూడా ఉంటుంది. ఈ మాంసం నిషేధానికి అధికారులు చెబుతున్న ప్రధాన కారణం 'పరిశుభ్రత'. అలాగైతే, దేశంలో ఎక్కువగా మాంసం వినియోగం, అమ్మకాలూ జరిగే దక్షిణాది రాష్ట్రాలు, ఉత్తరాది కంటే, కాశీ కంటే ఎంతో పరిశుభ్రంగా ఉంటున్నాయి కదా అని బీబీసీ (తెలుగు) ఎడిటర్ జి.ఎస్.రామ్మోహన్ ప్రశ్నించారు. కాబట్టి ఇక్కడ విషయం కేవలం పరిశుభ్రత మాత్రమే కాదు, దాని వెనుక ఉన్న భావజాలం. ముఖ్యంగా క్రైస్తవ, జైన, బౌద్ధాల ప్రభావం వల్ల శాకాహారవాదం తీవ్రంగా విజృంభించింది. అదే ఏకైక హిందూ మత ధర్మం అన్నట్లుగా నేడు ప్రచారంలోకి వచ్చింది. మరి ఆగమ శాస్త్రం హిందూమతంలో భాగమైతే, తంత్రశాస్త్రం హిందూ మతం కాదా? కామాఖ్య, కాలభైరవ హిందూమతంలోని వారు కారా? భారతీయ పూజా విధానాలు, బహుళత్వం పట్ల, పాశ్చాత్యులు, క్రైస్తవ మిషనరీలు తీవ్ర వ్యతిరేకతను ప్రదర్శించాయి. విలియం కేరీ, ఎమ్మా రౌషెన్‌బుష్ క్లా, హెన్రీ వైట్ హెడ్, జోసెఫ్ ముల్లెన్స్, జాన్ మోరిసన్ వంటి పాశ్చాత్య క్రైస్తవ మిషనరీలు ఇక్కడి స్థానిక అమ్మదేవతల శక్తి పూజలను, జానపద జంతు బలులను 'అనాగరికమైనవి' అని ముద్ర వేస్తూ, ఇవి అసలైన ఉన్నతమైన ఆర్య-- హిందూమతంలో భాగం కాదంటూ వాటి నిషేధం కోసం ప్రచారం చేశాయి. మన ఆలోచనలు విశ్వాసాలపై పాశ్చాత్య క్రైస్తవ వలసవాద ప్రభావాలు బలంగా ఉన్నాయి. అలాగే బౌద్ధ, జైన ధర్మాలను పునరుద్ధరించడంలో భాగంగా అహింసావాదం తీవ్రస్థాయికి చేరింది. ఆర్యసమాజ్ ప్రభావం, అలాగే బౌద్ధ-- జైన తత్వాల పట్ల ఆకర్షితులైన దళితవాది, ఆది హిందువు అని పేరు పెట్టుకున్న భాగ్యరెడ్డి వర్మ వంటి వారు కూడా అమ్మ దేవతల జంతు బలులను, (అలాగే గోవధ కూడా) నిషేధించాలని ఉద్యమించారు. ఒకే విధమైన ఆచారం-- ఆహారం-- ఒకే దేవుడు-- గ్రంథం (వేదం) అనే ఆలోచనల ద్వారా క్రైస్తవాన్ని అనుకరిస్తూ ఆర్యసమాజం హిందుత్వకు మూలంగా మారింది. అంతేగాక వ్యాపార వర్గాలలో జైన మతస్థులు అధికంగా ఉండడం వల్ల కూడా హిందూ సమాజంపై, ఆహార నియమాలపై జైనం ప్రభావం చూపింది. కాశీలో మాంసాన్ని మాత్రమే నిషేధించి, మద్యం వ్యాపారానికి అవకాశం ఇవ్వడం కూడా బౌద్ధ జైన క్రైస్తవ ప్రభావం వల్లనే. నిజానికి కాశీలో తాంత్రిక పద్ధతుల ప్రభావం ఎక్కువ. (అఘోరాలు, కాపాలికులు...) కానీ ఇప్పుడు ఈ జైన, క్రైస్తవ పద్ధతుల చట్రంలో కాశీని కూడా ఏకరూప 'బ్రాహ్మణీకరణ' చేయాలి అనే దృష్టి పెరిగింది. నిజానికి కాశీలో నివసించే బెంగాలీ, ఒరిస్సా, మైథిలి బ్రాహ్మణులు, కాశ్మీరి పండిట్లు శతాబ్దాలుగా మాంసాహారులు. వారి కర్మకాండలలో, పూజలలో మాంసం ఉంటుంది కాబట్టి ఇది కేవలం బ్రాహ్మణేతరుల సమస్య కాదు. జర్నలిజం కథనాలు, స్థానిక బ్రాహ్మణ పండితుల ఇంటర్వ్యూలలో శాక్తేయ బెంగాలీ బ్రాహ్మణులు ఇలా స్పష్టం చేస్తున్నారు-- దుర్గాపూజ, కాళీపూజల సమయంలో అమ్మవారికి 'బలి' ఇవ్వడం లేదా మాంసాన్ని / చేపలను భోగ్‌గా (నైవేద్యంగా) సమర్పించడం మా శాక్తేయ సంప్రదాయం. దీనిని నిషేధించడం మా మత స్వేచ్ఛను, సంప్రదాయాన్ని హరించడమే'. కొందరు పండితులు తాము నిత్యం చేపలు తింటామని, ఇది కాశీ విశ్వనాథుడి అంగీకారంతోనే సాగుతున్న సంస్కృతి అని పేర్కొన్నారు. దీనిని బట్టి చూస్తే, ఇది హిందూ మతం పేరుతో జరుగుతున్న ఒక కొత్త నిర్వచనం, ఒక కార్పొరేట్ వ్యాపార ఆధిపత్యం చోటుచేసుకోవడానికి సూచనగా కనిపిస్తుంది. ఆహారం అనేది కేవలం బతకడానికి, పుష్టికి, రుచి కోసం మాత్రమే మనిషి స్వీకరించేది కాదు. ఆహారం ఒక భావజాలం, ఒక మతం కూడా. 'మనుషులు ఆహారం తినరు, భావాలను తింటారు' అంటారు తత్వవేత్త యూజీ.

'తదన్నాః తస్య దేవతాః' అని రామాయణం. ఎవరు ఎటువంటి ఆహారం తింటారో, వారి దేవతలకు కూడా అదే ఆహారాన్ని పరమ ప్రసాదంగా పెడతారు. అందుకే మాంసాహారి తన దైవానికి మాంసాన్ని నైవేద్యం పెడతాడు. శివభక్తుడైన కన్నప్ప చేసింది అదే, అందుకే గుడులలో ఆగమ పూజావిధానంతో పాటు తాంత్రిక పూజా విధానం కూడా పక్కపక్కనే వర్ధిల్లింది. అంతేకాదు, వైదిక యజ్ఞయాగాదులలో పశుబలి ప్రాచీన కాలం నుంచి ఉంది. వైష్ణవులు మాత్రమే దీనిని వ్యతిరేకిస్తూ పిండితో చేసిన పశువును హోమం చేస్తారు. కానీ వైష్ణవ పద్ధతులకు భిన్నంగా, మాంసాన్ని హోమం చేసే ప్రాచీన బ్రాహ్మణ శ్రౌత ఆచారం మిగిలి ఉంది. 'వైష్ణవం జైనాన్ని అనుకరిస్తుంది' అని మాధవాచార్యులు (14వ శ.) 'సర్వదర్శన సంగ్రహం'లో రాశారు. జైన, బౌద్ధ, క్రైస్తవాల అనుకరణతో కూడిన (అంటే వైవిధ్యాన్ని ఒప్పుకోని) ఒక సరికొత్త వైష్ణవ రూపం మాత్రమే అసలైన హైందవంగా నేడు ప్రచారంలోకి వస్తోంది. రామాయణంలో సీతారాములు మాంసాహారం స్వీకరించినట్లు, అలాగే సీత గంగకు మద్యమాంసాలను సమర్పిస్తానని మొక్కుకున్నట్లు వాల్మీకి రాశారు. కానీ అది మాంసాహారం కాదని, శాకాహారమని అర్థాన్ని మార్చి చెప్తున్నారు గీతా ప్రెస్ వంటి ప్రచురణలలో. ఇలా సనాతన గ్రంథాలను కూడా హైందవీకరిస్తున్నారు. ఆహారానికి మత, కర్మకాండపరమైన హోదా ఉండడం అనేది సమాజంలో ఆ ఆహారం పట్ల గౌరవాన్ని, ఆమోదాన్ని పెంచుతుంది. నాన్--బ్రాహ్మిణ్స్‌లో మాత్రమే కాదు, కొన్ని బ్రాహ్మణ శాఖలలో కూడా ఉన్న ఈ మాంసాహార అలవాటుకు ఒక సామాజిక గౌరవం, ఆమోదం ఈ తాంత్రిక పూజల వల్లే లభించేది. కాళిదాస 'అభిజ్ఞాన శాకుంతలం' నాటకంలో, ఒక రాజకుటుంబీకుడు జాలరితో 'నువ్వు జీవహింస చేసే నీచమైన బ్రతుకు బతుకుతున్నావు' అని అవమానకరంగా మాట్లాడతాడు. దానికి జాలరి దీటుగా జవాబు చెప్తాడు... 'యజ్ఞాలలో పశు హింస చేసే బ్రాహ్మణులు కూడా నా బోటి వారే' అని. ఈ సంభాషణ ఎప్పటినుంచో సాగుతున్న ఆహార, ఆచారపరమైన వైవిధ్యాల మధ్య ఘర్షణను సూచిస్తున్నది. ఈ ఘర్షణ ఎప్పటికీ పూర్తిగా పరిష్కారం కాలేదు, కానవసరమూ లేదు. ఎందుకంటే, ఇలాంటి అనేక వైరుధ్యాలు, వైవిధ్యాలు భారతదేశంలో ఒకదానినొకటి గౌరవించుకుంటూ పక్కపక్కనే జీవించాయి. భారతదేశపు సౌందర్యం ఈ బహుళత్వంలోనే ఉంది. నేటి ఆధునికత, రాజకీయ హిందూత్వల పేరిట జరుగుతున్న ఏకరూపత (ఞశీఎశీస్త్రవఅఱఓష్ఱశీఅ) వల్ల ఈ ప్రాచీన వైవిధ్యానికి ముప్పు వాటిల్లుతోంది.

# మహాప్రయాణం

క్రీస్తు పూర్వం 8వ శతాబ్దానికి చెందిన గ్రీకు అంధకవి హోమర్ సృజనగా చెప్పే రెండు ఇతిహాస కావ్యాలు-- ఇలియడ్, ఒడిస్సీ. ఇవి పాశ్చాత్య ప్రపంచానికి మన రామాయణ, మహాభారతాల్లాంటివి. పైగా కొనసాగింపు కథలు. ట్రోజన్ యుద్ధం, హెలెన్--పారిస్ ప్రేమ, హెక్టర్ త్యాగం, అకిలీస్ పరాక్రమం, రక్తపాతం, వినాశనాన్ని ఇలియడ్ చూపిస్తే... ఆ యుద్ధం ముగిసిన తర్వాతి కథను ఒడిస్సీ చెప్తుంది. పదేళ్లపాటు జరిగిన ఆ యుద్ధంలో గెలిచిన గ్రీకు వీరుడు, ఇతకా రాజు అయిన ఒడిస్సీస్ (దీన్నే లాటిన్‌లో ఉలిసేస్ అని ఉచ్చరిస్తారు) తిరిగి తన భార్య పెనలోపి, కొడుకు తలామకస్ దగ్గరికి చేరుకోవడానికి పదేళ్లపాటు పడిన కష్టాలే ఈ కావ్యం. ఆ కష్టాల్లో కొన్ని విధివిలాసమైతే ఇంకొన్ని స్వయంకృతం. ఇలియడ్ బాహ్య యుద్ధమైతే, ఒడిస్సీ ఒక అంతర్మథనం. 'ధైర్యంగా ఉండు నా హృదయమా; నేనొక సైనికుడిని; ఇంతకంటే ఘోరమైన దృశ్యాలనే నేను చూశాను.' 'దేవుళ్లు మానవులకు కష్టాలను ఇస్తారు, తద్వారా రాబోయే తరాలకు చెప్పుకో వడానికి ఒక కథ మిగులుతుంది' అంటాడు హోమర్. ఒక నాయకుడు ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ, తనను తాను తెలుసుకుంటూ గమ్యాన్ని చేరడం అనే ఇతివృత్తానికి ఒడిస్సీ శ్రేష్ఠమైన నమూనా. ఒడిస్సీస్ కేవలం శారీరక బలం గలవాడే కాదు, దుర్భేద్య మైన ట్రాయ్‌ని, కొయ్యగుర్రం (ట్రోజన్ హార్స్) పొట్టలో సైనికులను రహస్యంగా పంపి, జిత్తులతో గెలిచినవాడు. అకిలీస్ శౌర్యం కోసం బతికితే, ఒడిస్సీస్‌కు బతకడమే ప్రధానం. వరాలు, శాపాలు, మాయలు, మంత్రాలతో సాగినప్పటికీ ఒడిస్సీలోని పాత్రలు కేవలం పురాణ బొమ్మలు కావు, అవి మానవ నైజానికి ప్రతీకలు. ఇందులో ఒంటికన్ను రాక్షసుడు పాలిఫేమస్ మన బకాసురుడిని గుర్తుకుతెస్తాడు.

కొడుకు పసివాడుగా ఉన్నప్పుడు యుద్ధానికి వెళ్లిపోయిన భర్త కోసం ఇరవై ఏళ్లు వేచి చూసే పెనలోపి పాత్రలో లక్ష్మణుడి భార్య ఊర్మిళను పోల్చుకోవచ్చు. తండ్రి పెంపకం కరవైనప్పటికీ, తల్లికి తోడుగా నిలిచి, చివరకు తండ్రితో కలిసి శత్రుసంహారం చేసే మంచి కొడుకు పాత్ర తలామకస్‌ది. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ ఒడిస్సీస్ లాంటివాళ్లే. ఆధునిక మానవుడు కెరీర్ అనే సంద్రంలో చిక్కుకుని, ఇంటి (ప్రశాంతత) కోసం వెతుక్కుంటున్నాడు. ఇప్పటికీ ఒడిస్సీ



ప్రాసంగితకు అదే కారణం. 'ఒక మనిషికి తన సొంత దేశం, తన తల్లిదండ్రుల కంటే మధురమైనది ఏదీ లేదు. పరాయి దేశంలో, కన్నవారికి దూరంగా ఎంతటి విలాసవంతమైన భవనంలో నివసించినప్పటికీ అవి దీనికి సాటిరావు'.

ఒడిస్సీకి ఆంగ్లంలోనే అరవైకి పైగా అనువాదాలు వచ్చాయని ఒక లెక్క. దాన్ని ప్రేరణగా తీసుకుని వచ్చిన సృజన మరింత విస్తారమైనది. జేమ్స్ జాయిస్ రాసిన చైతన్య స్రవంతి నవల 'ఉలిసేస్' మామూలు మనుషుల మహాప్రస్థానాన్ని చెబుతుంది. 'భువన సుందరి'గా ఇలియడ్, 'రూపధరుడి యాత్రలు'గా ఒడిస్సీ తెలుగులోకీ వచ్చాయి. తాజాగా ఒడిస్సీని తెలుగు పాఠకులకు చేరువ చేయడానికి వేమూరి వేంకటేశ్వర రావు, వెంకట్ సిద్ధారెడ్డి కూడా ప్రయత్నించారు. ఒడిస్సీ, ఇలియడ్ ఇంతకుముందు చాలాసార్లు తెరకెక్కాయి. ఎన్నిసార్లయినా అంతే ఆసక్తిని పుట్టించాయి. ఈ కాలపు వండర్ డైరెక్టర్ క్రిస్టోఫర్ నోలన్ లాంటివాడు దీనిమీద ఆసక్తి కనబరచాడంటే, ప్రపంచం అంతకంటే అమితాసక్తితో జూలై 17న విడుదల కానున్న హాలీవుడ్ ఒడిస్సీ కోసం ఎదురుచూస్తోంది.

'ఇంటర్‌స్టెల్లార్'లో అంతరిక్ష ప్రయాణాన్నీ, 'ఇన్సెప్షన్'లో కలల ప్రయాణాన్నీ చూపించిన నోలన్‌కు ఒడిస్సీకంటే నప్పే కథ మరొకటి ఉండదు. స్థలకాలాలతో ముడిపెట్టి దీన్ని ఎలా చూపిస్తాడనే కుతూహలం అంతటా నెలకొంది. ఇలియడ్ ఆధారంగా వచ్చిన ట్రాయ్ (2004) సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం నోలన్‌కు వచ్చిందట. కానీ అది కుదరలేదు. మళ్లీ ఇరవై ఏళ్ల తర్వాత ఆయన ఒడిస్సీ రూపంలో హోమర్‌కు దగ్గరయ్యాడు. తప్పిపోయిన ఇంటికి ఒడిస్సీస్ 20 ఏళ్ల తర్వాత చేరుకున్నట్టే, నోలన్ కూడా తనకు ఇష్టమైన ఈ సబ్జెక్టును చేపట్టడానికి 20 ఏళ్లు పట్టింది. ఆలస్యం అవడం అంటే ఒడిస్సీస్‌లా వయసు పెరగడమే; అంటే మరింత పైచూపుతో జీవితాన్ని చూడగలిగే పరిణతి రావడమే!

# ఇడుపు కాయితం ఇచ్చినా ఎందుకీ ?

ఇడాకులైనంక గూడా వాని చుట్టాలను బెట్టుకున్న చూడు, అక్కడే ఉన్నది మన తప్పంతా. మన బిడ్డ మొగడొక్కడే చెడ్డోడనుకున్నం గానీ, వాళ్ల బలగమంతా అట్లనే పాడయింది! ఒక్క తెలంగాణ సీన్మను భరించలేనోడు నవనిర్మాణం చేస్తడంట. ఇప్పటికి చేసింది చాలలే? చెరువులు, నాలాలు, దనిజామిచ్చిన లక్షల ఎకరాలు, బంజారా జాతికి ఇచ్చిన బంజారాహిల్స్ అన్నీ ఆక్రమించిన్రు గదా! ఇంకేం కావాలి? మా ఎంకన్న రాసినట్టు మీరు రావచ్చు.. పోవచ్చు.. రొయ్యలమ్ముకోవచ్చు, రవీంద్రభారతిలో రాయబార నాటకమాడచ్చు కానీ బయట నాటకాలు, నాటు మాటలు ఇగచెల్లవు. అర్థం కానీ హిందీ సినిమాలు చూస్తరు గదా, ఒక్క ముక్క మాట్లడలేరు. మరి అరవై ఏండ్ల నుంచి ఇంటున్న తెలుగు అర్థం కాదా? లేక నాటకాలా? మరి మా నెత్తిన ఆ అనాగరిక సీన్మలు రుద్దారు. మేమేమన్నాం? పక్కవాడిని కొట్టడం గేలిచేయడం- అదే హాస్యం గదా మీకు? సీన్మలో ఏ హీరో అయినా కారో, మోటరు బైకో దిగి దాన్ని గేటుకు అడ్డంగా పెట్టి గేటు తీసుకొని వస్తాడు కదా! తీసిన గేటు వేసిన హీరోను నేను ఏ సీన్మలో చూడలే! అమ్మాయిల కొంగులు లాగే హీరోలు, వారిని ఎట్లా పడేయాలి అని కాలేజీల్లో చర్చించే పోరలు, పాఠం చెప్పే గురువును రకరకాలుగా ఏడిపించే అబ్బాయిలు ఇవన్నీ మా సీన్మలల్ల లేనందున మీకు నచ్చవు. మీరు మా సీన్మలు చూడొద్దు, మేము మీ సీన్మలు చూడము. సరేనా? అసలు మీ అనాగరిక సీన్మలు మాకు వద్దు, మా పోరలు ఇప్పటికే చెడిపోయి, తన రాష్ట్రానికి ఏమీ చెయ్యని మంత్రిని హీరో అనుకొని వెంటపడుతున్నరు. గిట్ల పాడైతే మా తెలంగాణ సంస్కృతి పాడైతది. గప్పుడు మేం కూడా రెండర్థాల పాటలు, రికార్డింగ్ డాన్సులలోకి దిగాలి. నేరేడుపండు రంగు పాంటు, గులాబీ రంగు అంగీ వేసుకొని లిప్‌స్టిక్ పెట్టుకొని మీ డాన్సుబాబు లాగ మా పోరలను చూడలేం! మీ డబ్బు ఏండ్ల సోపతిలో నా భాష గూడ చెడిపోయింది!వీశీజఱవం

ఇక మీరు అనువాదం అక్కరలేకుండా మీ భాషలో చెప్తాను అసలు మాకు కొన్ని సందేహాలొస్తాయి. వచ్చింది అనే పదం అమెకు వాడుతాం, మరి ఆయన వచ్చిండు అనాలి కదా సరిగ్గా భాష తెలిస్తే? ఈ వచ్చాడు అనే పదం ఎక్కడి నుంచి వచ్చింది? ఇలాంటివి రాస్తే ఒక పుస్తకం నిండుతుంది. మీరు మీ అమ్మాయిని పుట్టింటికి తీసుకొస్తారు, మేం మా బిడ్డను తొలుకొస్తాం. అంటే వారే నడిచి వస్తారు ఇంట్లోకి, తీసుకురావక్కర లేదు. ముత్యాలముగ్గు సినిమాలో రావుగోపాలరావు తన సెగ్రటీని అడుగుతాడు. రాయుడు వచ్చాడా? తీసుకొచ్చావా? అని. అంటే అర్థమైందనుకుంటాను. నెల్లూరులో పెరిగిన వాళ్లు షాపులో ఏదైనా వస్తువు కొనడానికి ఎత్తి అంటారని మాకు తెలియదు. ఒకసారి ఒక ఆవిడ మా అమ్మగారి దగ్గర కొంచెం డబ్బు అప్పు తీసుకొని తర్వాత ఇస్తా అనడానికి బదులు చీర ఎత్తినంక ఇస్తానండీ అనగానే మా అమ్మగారు కంగారుపడి సరే సరే అని ఆవిడని పంపించేశారు. అలాగే ఒకసారి ఒక బిచ్చగాడు మా ఇంటి ముందు నుంచుని పిలిచాడు ఏదైనా వేయమని. ముందు గదిలో కూర్చున్న ఒక తూర్పుగోదావరికి చెందిన మనిషి పైకెళ్లు, ఇక్కడేం లేదు అని అన్నాడు. ఆ బిచ్చగాడు సందేహించకుండా పక్కనే ఉన్న మెట్లెక్కి పై పోర్షన్‌కు వెళ్లిపోయాడు. ఎందుకంటే తూగోజీ వాళ్ల భాషలో పైకెళ్లు అంటే వీధిలో ఇంకో చోటికి వెళ్లుమని! అలాగే




తూగోజీ వాళ్లకు కబురు అంటే చావు కబురే, మామూలు మాట కాదు. మిగతా వాళ్లంతా సరదాగా కబుర్లాడుకుంటారు, వాళ్లు మాత్రం కబురొస్తే మైలస్నానం చేయాల్సిందే! ఇక తాట తియ్యడం, నార తియ్యడం, తాట వలవడం, నిలువునా చీరేయడం, అడ్డంగా నరకడం, దానిని, దీనిని పడేయడం లాంటి మాటలను మేం ఎంత కష్టపడి భరిస్తున్నాం? ఒకసారి ఇలాగే మా ఇంటికి వచ్చిన ఆంధ్ర పెద్ద మనిషి, నా అయిదేండ్ల అబ్బాయి భాషను ఎక్కిరించాడు. ఏరా నువ్వు మాట్లాడితే నాకు ఏమీ అర్థం కావటడంలేదు అన్నాడు. అప్పుడు మా కొడుకు అంకుల్ మీరు మా తెలంగాణకు వచ్చారా, మేము మీ ఆంధ్రాకు వచ్చామా? మా దగ్గరకు వచ్చినప్పుడు మా భాష మీరు నేర్చుకోవాలి అని తన భాషలోనే సమాధానం చెప్పాడు.

ఈ మాట మన చరిత్రలోనే ఉన్నది. ఇక్కడ సాలార్‌జంగ్-1 ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు జరిగింది. ఆ కాలంలో మానవ చరిత్రలోనే నంబర్‌వన్ సంపన్నుడైన నిజాము రాజ్యంలో భారతదేశంలో పని చేస్తున్న ఐసీఎస్ (ఇప్పటి ఐఏఎస్‌తో సమానం) ఆఫీసర్ల కంటే ఒక ప్రభుత్వోద్యోగి జీతం ఎక్కువ ఉండేది. అందుకే అప్పుడు అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలో చదివి పట్టా పొందిన కొందరు ముస్లింలు నిజాం రాజ్యానికి వచ్చి ఉద్యోగాలిమ్మని అడిగారు. అప్పుడు ఇక్కడ పర్షియన్ జాతీయ భాషగా ఉన్నది. ప్రభుత్వ భాష, విద్యాలయాల్లో ఆ భాష మాధ్యమమే ఉండేది. అప్పుడు సాలార్‌జంగ్ మీరు పర్షియన్ నేర్చుకొని రండి ఉద్యోగాలిస్తాం అని చెప్పారు. అయితే వాళ్లు తమకు ఉర్దూ బాగా వచ్చనీ, అరబిక్ కొద్దిగా తెలుసనీ చెప్పినా, ఆయన సమాధానం ఒకటే! మా దేశంలో బతకాలంటే, ఉద్యోగాలు చేయాలంటే మా భాషలో మీరు నిష్ణాతులుగా ఉండాల్సిందే అని ఖరాఖండిగా చెప్పారు. ఇప్పుడు మనం అదే నిష్కర్షగా చెప్పాలి. ఆంధ్ర వాళ్లతో తెలంగాణ భాషలోనే మాట్లాడాలి. మరి ఈ విచిత్ర జీవులు అమెరికాలో వాళ్ల హీరోల సినిమాలు చూస్తూ చేసే అల్లరి, గోలకే కదా అక్కడి సామాన్య ప్రజలు అసహ్యించుకుంటున్నారు!

ఆంధ్ర, తెలంగాణ భాషల గురించి ప్రసంగాలు చేసినప్పుడు జయశంకర్ సార్ ఒక సంగతి చెప్పేవారు. తెలంగాణ వాళ్లు తమ మాటల్లో ఎక్కువ ఉర్దూ వాడుతారని ఆంధ్రవారు ఎక్కిరిస్తారు. కానీ నిజానికి ఇక్కడి వారి కంటే ఆంధ్రవారే తమ భాషలో ఎక్కువ ఉర్దూ పదాలు వాడతారు. అయితే వాళ్లు ఎందుకు మనల్ని గేలి చేస్తారంటే, వారు వాడేవి ఉర్దూ పదాలని వారికి తెలియదు. వారికి తెలియదన్న విషయం కూడా వారికి తెలియదు అనేవారు ఆయన. ఈ మాటలు చెప్పే ఆనందరావు తోట, జయశంకర్ గార్లు విజయవాడలోని జంధ్యాల పాపయ్య గారి నోరు మూయించారు. కరుణశ్రీ అని కలం పేరు పెట్టుకొని ఆయన తెలంగాణ మీద విషం కక్కేవాడు. తెలంగాణ రాష్ట్రం విడిగా చేస్తే అది దక్షిణ పాకిస్థానం అవుతుందనీ, ఇక్కడ భాష తౌరక్యాంధ్రం అవుతుందనీ నికృష్టపు మాటలు రాసేవాడు. అసలు ఇక్కడి భాష ఆంధ్రం కాదు, తెలుగు. మరి వారి తౌరక్యాంధ్రం ఎట్లా ఉంటుందో మనం విశ్లేషిద్దాం.

ముందుగా వారి సంస్కృతి గురించి ఒక్కమాట! పాత ఆంధ్ర సినిమాలోనే ఒక హాస్య సంబంధమైన పాట ఉన్నది. డబ్బొస్తే సుబ్బమ్మే సుబ్బలక్ష్మి, ధనమొస్తే ఎంకయ్యే వెంకటేశ్వర చౌదరి అని! హైదరాబాద్‌లో అన్ని హంగులతో ఇండ్లు కట్టుకొని, వ్యాపారాలు చేసుకుంటూ అహంకారంగా స్థానికుల మీద వారి సంస్కృతి మీద హేళనగా విమర్శలు చేసే బదులు, వారి ప్రాంతంలో ఇంకా సత్తెమ్మలు, అప్పిగాళ్లు ఉన్నారు కదా, ఈ ధనవంతులు వారి గురించి ఎందుకు ఆలోచించటం లేదు? ముఖ్యమంత్రితోపాటు వారానికి మూడు రోజులు ఈ అనాగరిక నగరంలో ఎందుకు బతకడం? త్వరగా వారి ప్రపంచ నగరం అమరావతిని పూర్తి చేసుకొని అక్కడికి వెళ్లవచ్చు కదా!

ఇక వీరి తౌరక్యాంధ్రం! ఒక వర్గం వారు బాగా సంపన్నులయ్యాక తమ పేరు వెనుక చౌదరి అని పెట్టుకుంటారని మనకు ఆంధ్రవారి సోపతిలో తెలిసిందే కదా! ఆ చౌదరి అన్నది ఉర్దూపదం, మరి అది వాడే వారికి ఆ విషయం తెలుసా? అ, ఇ, ఉ అక్షరాలతో పదాలు చూద్దాం. అసలు, అండ, అంబారి, అజమాయిషీ, అటకాయించు, అడ్డా, ఆసామీ, ఉడాయించు. ఇడుపు కాయితం ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉన్నదే. ఇక మిగతా కొన్ని చాలా సాధారణంగా వాళ్ల సొంత భాషలాగే ఆంధ్రులు వాడే పదాలు చూద్దాం.

కంకర, కంగాళీ, కబురు, కబేలా, కమాను, కమామీషు, ఖరారు, కుళాయి, కళాసి, కామందు, కాయము, ఖాయిలీ, కాళీ, కితాబు, కిలాడి, కుల్లాయి, ఖైదీ, కైఫియత్తు, కౌలు, ఖజానా, ఖరీదు, ఖర్చు, ఖామందు, ఖాయం, గప్పాలు, గమ్మత్తు, గాబరా, గిరాకీ, గుంజాయిషీ, గుత్తేదారు, గుమాస్తా, గులాబీ, గులాం, గైర్హాజరు, గోడ, ఘెరావ్ మొదలైనవి. ఇలా కొన్ని వందల పదాలు వాటి ఉచ్చారణ మార్చేసి కొన్ని కొన్ని పదాల అర్థాలు మార్చేసి కూడా ఆంధ్రవారు ఉపయోగిస్తారు. ఉదాహరణకు ఖూన్ అంటే హత్య. ఖూనీ అంటే హత్య చేసినవాడు. ఆంధ్రవారు హత్యను ఖూనీ అని వ్యవహరిస్తారు. ఖూనీ ఖూన్ చేస్తాడు. కానీ వీళ్లు మొత్తం భాషనే ఖూన్ (వాళ్ల తౌరక్యాంధ్రంలో ఖూనీ) చేస్తారు. ఇలా పదాలు ఒక 100 పేజీలకు సరిపడా ఉన్నాయి. మరి తేనెలొలికే తెలంగాణ తెలుగు సంకర భాషనా? తౌరక్యాంధ్రం సంకరభాషనా? ఇలాంటి విషయాలు మాట్లాడుకుంటుంటే కాళోజీ గారితో చర్చిస్తుంటే గంటలు నిముషాల్లా గడిచేవి. ఆయన ఒకమాట చెప్పి నవ్వేవారు. దఫ్తర్‌కెళ్లి దరఖాస్తు దాఖలు చేశిన అని అంటే హేళనగా నవ్వేవాళ్ల మాతృభాష ఇలా ఉంటుంది. ఆఫీసుకెళ్లి అప్లికేషన్ సబ్మిట్ చేశాను అని. అది ఆంధ్రభాషే వారికి అనేవారాయన. ఇక ఇడుపు కాయితం పుచ్చుకొని ఆంధ్రులు వారి ప్రాంతానికి వెడితే వారి భాష గురించి మేము మాట్లాడం ప్రామిస్!

# రైతులకు ధాన్యం నగదు ఎప్పుడు

**మహబూబ్ నగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన భాగంగా, రైతులకు లబ్ధి చేకూర్చాలని లక్ష్యంతో ఒక ప్రక్క ఐకెపి కేంద్రాలు, మరొక పక్క సొసైటీ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి, సకాలంలో డబ్బులు అందించి రైతులకు లబ్ధి చేకూరాలని లక్ష్యంతో కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేశారు. ధాన్యం రైతు కొనుగోలు కేంద్రాల్లో పోసిన నాటి నుండి నేటి వరకు అనేక విధాలుగా కష్టపడి కాంటాలు పెట్టి, లారీలలో లోడ్ చేసి, మిల్లులో దిగుమతి చేశారు. నెల లు గడిచిన ధాన్యం నగదు రాకపోవడంతో రైతులు అనేక బాధలు పడుతున్నారు. మండలం లో మొత్తం 17 ఐకెపి కేంద్రాలు, 11 సహకార సొసైటీల ద్వారా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ధాన్యం అమ్మకాలు చేశారు. దీనిలో 17 ఐకెపి కేంద్రాల ద్వారా 2,60,780 క్వింటాల ధాన్యా న్ని సుమారు 3785 మంది రైతుల ద్వారా మిల్లులలో కొనుగోలు చేశారు. తుంగతుర్తి రైతు సేవ సహకార సొసైటీ 11 సెంటర్ల ద్వారా సుమారు, 3000 మంది రైతుల గాను, 500 రైతుల పైచిలుకు ధాన్యం బిల్లుల కోసం మిల్లుల చుట్టూ తిరుగుతున్నామని, సొసైటీ అధికారి పేర్కొన్నారు.ఐకెపి సెంటర్ల ద్వారా ప్రస్తుతం 3000 మందికి రైతులకు ధాన్యం అమ్మకాలపై డబ్బులు అందించినట్లు ఐకెపి ఎపిఎం యాదమ్మ తెలిపారు. 785 మంది రైతులకు, నెల రోజులు గడిచినప్పటికీ, నేటికి నగదు అందలేదని, అకౌంట్లో బిల్లులు పడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం సీజన్ స్టార్ట్ అయినప్పటికీ, ఒక ప్రక్క విత్తనాలు మరొక ప్రక్క యూరియా, డిఎపి అవసరాలు ఉండగా, సమయానికి ప్రభుత్వం డబ్బులు పంపిణీ చేయలేదని, మాకు అప్పు కూడా పుడుతలేదని వివిధ గ్రామాల రైతులు ఆవేదన చెందుతున్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి,



సంబంధిత ఐకెపి సొసైటీ యాజమాన్యాలతో మాట్లాడి బిల్లులు వేగవంతంగా చేసి డబ్బులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు, మేధావులు, వివిధ పార్టీ నాయకులు కోరుతున్నారు.రైతు సేవ సహకార సొసైటీ ద్వారా సెంటర్ లో ధాన్యం పోసి అమ్మకం చేసి, రెండు నెలలు గడుస్తున్న నేటి వరకు కూడా నాకు డబ్బులు రాలేదు. దీనితో విత్తనాలు ,యూరియా కొనాలంటే ఇబ్బందికరంగా ఉంది. తక్షణమే అధికారులు స్పందించి, ధాన్యం బిల్లు వచ్చే విధంగా చూడాలి.ప్రస్తుతం ఈ సీజన్లో 2,60,000 785 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశాము. సుమారు 3785 మంది రైతులకు గాను 3000 రైతులకు బిల్లుల చెల్లింపులు జరిగాయి. ఇంకా సుమారు 785 మంది రైతులకు నగదు రావాల్సి ఉంది. ఈ చెల్లింపులకు అవసరమైన అన్ని పనులను సిబ్బందితో ఆన్ లైన్ లో ఇప్పటికే పూర్తి చేయించాం. నగదును తొందరగా ఇప్పించేందుకు కృషి చేస్తున్నాము.

# 15 ఏళ్ల సమస్యకు మంత్రి పరిష్కారం

**కరీంనగర్ :** బస్సు సౌకర్యం లేని గ్రామాలకు కొత్త సర్వీసు ప్రారంభించి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవ చూపించారు. దీంతో ఆ మార్గంలోని గ్రామాలు.. గత 15 ఏళ్లుగా బస్సు కోసం చూస్తున్న ఎదురుచూపులు ఫలించాయి. దీంతో వారు మంత్రి అడ్లూరికి ధన్యవాదాలు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా తమ మార్గంలో బస్సు నడపాలని పలు గ్రామాల ప్రజలు కోరినా.. ఎవరూ పట్టించుకోలేదని మంత్రి అడ్లూరి తమ గోడు విని స్పందించారని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుత యుగంలో ప్రజల జీవనశైలి శరవేగంగా మారిపోతున్నా.. కొన్ని మారుమూల ప్రాంతాలు మాత్రం వెనకబడిపోతూనే ఉన్నాయి. ఇప్పటికీ దేశంలోని కొన్ని ప్రాంతాలకు కరెంటు, రోడ్లు, తాగునీరు, బస్సు సౌకర్యం లేకపోవడం తీవ్ర ప్రశ్నలకు దారితీస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే అలాంటి గ్రామాలకు మౌలిక వసతుల కల్పన జరిగితే.. ఆ జనాల్లో వచ్చే ఆనందాలే వేరు. ఇలా కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్న వారి దీనస్థితిని చూసి రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, సెలబ్రిటీలు రంగంలోకి దిగి.. వారి సమస్యలను పరిష్కరిస్తున్న సంఘటనలు చూస్తూనే ఉన్నాం. తాజాగా బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.. బస్సు సర్వీసు ఏర్పాటు చేసి వారి మొహాల్లో చిరునవ్వులు చిందేలా చేశారు.జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి వెల్గటూర్ మండల కేంద్రానికి 15 ఏళ్ల తర్వాత ఆర్టీసీ బస్సును పునరుద్ధరించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో వారికి బస్సు సౌకర్యం వచ్చింది. ఈ బస్సు సర్వీసు జగిత్యాల నుంచి ప్రారంభమై.. వయా గొల్లపల్లి, చిల్వకోడూర్, అబ్బాపూర్ మీదుగా వెల్గటూర్ వరకు గతంలో నడిచేది. కానీ ఆ బస్సు సర్వీసును రద్దు చేయడంతో ఆ మార్గంలో ఉండే గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలోనే తమకు తిరిగి బస్సు



సౌకర్యం కల్పించాలని.. గత 15 ఏళ్లుగా ఎంతోమందికి విజ్ఞప్తులు, వినతులు పెట్టుకున్నారు.ఈ క్రమంలోనే ఆయా గ్రామాల ప్రజలు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కోరగా ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని వారికి తిరిగి బస్సు సౌకర్యం కల్పించారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం రోజున అబ్బాపూర్ గ్రామంలో కొత్త బస్సు సర్వీసును మంత్రి అడ్లూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి అడ్లూరి.. బస్సు సౌకర్యం కోసం గ్రామస్థులు చాలాసార్లు తనకు విజ్ఞప్తి చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయా గ్రామాల ప్రజల కోరిక మేరకు బస్సు సౌకర్యాన్ని తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. స్థానిక గ్రామాల ప్రజలు ఈ బస్సు సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.అదే సమయంలో అబ్బాపూర్ గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా మంత్రి అడ్లూరి ప్రారంభించారు. అదే సమయంలో ఆ గ్రామంలో మూతబడిన పాఠశాల తిరిగి పునరుద్ధరించగా.. దాన్ని కూడా మంత్రి ప్రారంభించారు. ఇక ఆ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించేందుకు తాను ప్రత్యేక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా గ్రామస్థులు కృషి చేయాలని హితవు పలికారు.

# వానా కాల్ వచ్చేస్తోంది...
# వంటా వార్పు ఎలా

**నల్గొండ:** ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టి ఏండ్లు గడుస్తున్నా ఇప్పటికీ కిచెన్ షెడ్లు నిర్మించలేదు. దీంతో మండల వ్యాప్తంగా అనేక పాఠశాలల్లో చెట్ల కింద వంట చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 57 ప్రభుత్వ విద్యాలయాలు ఉండగా అం దులో 4,000 వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదువు తున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టడానికి అవసరమైన మౌలిక వసతులు అనేక పాఠశాలలో ఇప్పటివరకు కల్పించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు, వంట వండి పెట్టే ఏజెన్సీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక పాఠశాలల్లో నీటి వసతి లేదని, చాలా చోట్ల కిచెన్ షెడ్లు లేవని , దీనితో పాఠశాలల ఆవరణలో వరండాలు, చెట్ల కింద వంట చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు.స్మార్ట్ క్లాస్‌రూమ్స్ గురించి మాట్లాడుతున్న ఈ రోజుల్లో, ఇంకా వేలాది ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారుల మధ్యాహ్న భోజనం చెట్ల కిందే వండుతున్నారు. వర్షం వస్తే వంట ఆగిపోతుంది.. పిల్లలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.చాలాచోట్ల నీటి వసతి లేని చోట వ్యవసాయ బావుల నుండి, సమీపంలోని ఇండ్ల నుండి నీళ్లు తెచ్చుకుంటున్నారు. వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడు వంటకి పెద్దగా ఇబ్బంది లేనప్పటికీ వర్షాకాలంలో తాము వంట చేయడానికి తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి



ఏర్పడిందని చెబుతున్నారు. మధ్యాహ్న భోజనం వండి పెట్టడానికి అవసరమైన వంట చెరుకు నిల్వ చేయడం, సామాగ్రి నిలువ చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలు కురిసే జులై, ఆగస్టు నెలలో వంట చేయడం తమకు పెద్ద తంటగా మారిందని వాపోతున్నారు.ఇక అధిక సంఖ్యలో విద్యార్థులు చదువుతున్న హైస్కూళ్ళు, కొన్ని ప్రాథమిక పాఠశాలలో కిచెన్ షెడ్లు, డైనింగ్ హాళ్లు లేకపోవడంతో విద్యార్థులు భోజనం చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. వందల మంది విద్యార్థులు ఒకేసారి భోజనం చేయడానికి అనువైన వసతి లేక తరగతి గదుల్లో, పాఠశాల ఆవరణ చెట్ల కింద భోజనం చేస్తున్నారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో డైనింగ్ హాళ్లను నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించగా చాలా చోట్ల పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు.ఇక ఇదే తరహాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కిచెన్ షెడ్ నిర్మాణం ప్రారంభించినప్పటికీ చాలా చోట్ల నిర్మించలేదు. దీనితో ఈ విద్యా సంవత్సరంలో కూడా పాత పద్ధతిలో చెట్ల కింద వంట చేయాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రతి పాఠశాలలో కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్ నిర్మించి, నీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.కేసముద్రం మండలంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, డైనింగ్ హాళ్లు లేక మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ ఇబ్బందిగా మారింది. వర్షాకాలంలో వంట సిబ్బంది చెట్ల కింద వంట చేయాల్సి వస్తుండగా, విద్యార్థులు తరగతి గదుల్లో లేదా ఆవరణలో భోజనం చేస్తున్నారు. నీటి వసతి లేకపోవడం సమస్యను మరింత పెంచుతోంది.

## పాలమూరుకు బ్రహ్మోస్ యూనిట్

**మహబూబ్ నగర్ :** పాలమూరు జిల్లాకు ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ రానుందనే ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో భేటీలో ఈ అంశం చర్చకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం మిస్సైల్ యూనిట్ ఏర్పాటుకు సానుకూలంగా ఉండడంతో మరోసారి ఆసక్తికరంగా మారింది. ప్రతిపాదిత ప్రాంతంపై త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. గతేడాది జూన్ 18న సీఎం రేవంత్ రెడ్డితో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు.తెలంగాణ ప్రాంతంలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ను విస్తరించాలని సంస్థ ప్రతినిధులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్ ? బెంగళూరు మధ్యలో మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర మండలంలో అవసరమైన ప్రభుత్వ స్థలం ఉందని వివరించారు. సీఎం వినతికి స్పందించిన ప్రతినిధులు ఆ తర్వాత మూడురోజుల్లోనే స్థల పరిశీలన చేసి నివేదిక రూపొందించారు.వాస్తవంగా మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని బస్వాయ్ పల్లి, చౌదర్ పల్లి గ్రామాల మధ్య సుమారు 400 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్, అనుబంధ సంస్థలకు అనుకూలంగా ఉంటుంది. ఔఊ 44, ఔఊ 167 కు మధ్యలో ఉన్న ప్రాంతం కావడంతో రవాణా సౌకర్యాలతో ఇబ్బందులు లేవు. అలాగే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సుమారు 100కిలో మీటర్ల దూరంలోనే ఉంది. గతేడాది స్థల పరిశీలన చేసిన అధికారులు పలు సూచనలు చేసినట్లు సమాచారం. మిగతా ప్రాంతాల్లోనూ స్థల అన్వేషణ చేసినా ఆఖీఆఒ బృందం పాలమూరు జిల్లా వైపే మొగ్గు చూపుతున్నట్లు టాక్ వినిపిస్తోంది.ఇక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు మరోసారి చర్చకు రావడంతో చౌదర్ పల్లి, బస్వాయిపల్లి గ్రామస్థుల్లో ఆశలు పెరిగాయి. దేశ రక్షణలో కీలకంగా మారిన మిస్సైల్ తయారీ తమ ప్రాంతంలో తయారు కావడాన్ని గర్వంగా ఫీల్ అవుతామంటున్నారు. అన్ని సౌకర్యాలు అనుకూలంగా ఉన్న నేపథ్యంలో కచ్చితంగా ఈ బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు, ప్రాంత అభివృద్ధికి అవకాశం లభిస్తుందని చెబుతున్నారు.త్వరలోనే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ ఏర్పాటు విషయంలో కేంద్రం అనుమతి వస్తుందని అందరూ ఆశగా ఎదురు చూస్తున్నారు. అనుమతి వస్తే దేశ రక్షణ వ్యవస్థలో పాలమూరు ఖ్యాతి ఇమిడిపోనుంది.

## తెలంగాణకు బంపర్ ఆఫర్

## కేంద్ర కేబినెట్‌లోకి ఇద్దరు..ఓ రెడ్డి..ఓ బీసీ..!

**హైదరాబాద్ :** తెలంగాణపై బీజేపీ సీరియస్‌గానే ఉన్నది అధికారం దక్కించుకోవడమే కేంద్రంగా ఏమి చేయాలో అన్నీ చేయడానికి సిద్దపడింది. సేమ్ చంద్రబాబు తరహాలో అవును..చంద్రబాబు కూడా ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో తెలిసినవారు పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు..ఏటికి ఎదురీదుతున్నప్పుడు, ఎవరితోనైనా చేతులు కలుపుతాడు అంతిమ లక్ష్యం అధికారం చేజిక్కించుకోవడం.ఇప్పుడు మోడీ, అమిత్ షాల ద్వయం తెలంగాణను తమ ఖాతాలో వేసుకునేందుకు పావులు కదుపుతున్నది. వ్యూహాలకు మరింతగా పదును పెడుతున్నది. మరో రెండు, మూడు రోజుల్లో కేంద్రం చేపట్టబోయే కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో తెలంగాణకు రెండు మంత్రి పదవులు దక్కనున్నాయి.ఒక్కటి ఇస్తే అదే పదివేలు అనుకుంటున్నారంతా అలాంటిది రెండు ఇవ్వాలనే కచ్చితమైన నిర్ణయానికి వచ్చినట్టుగా ఢిల్లీ పెద్దలు చర్చించుకుంటున్నారు. ఇందులోనూ సామాజిక సమీకరణలకు పెద్దపీట వేయనున్నారు. డీకే అరుణ, ఈటల రాజేందర్‌లకు దాదాపుగా కేబినెట్‌లో బెర్త్ ఖరారైందని తెలుస్తోంది. మొదటి నుంచి వీరిద్దరి పేర్లు ప్రధానంగా చర్చలో ఉన్నాయి. కానీ ఇద్దరికీ ఇవ్వడం కష్టమేననే భావన అందరిలో ఉంది.ఇప్పటికే బండి సంజయ్, కిషన్‌రెడ్డిలకు మంత్రి పదవులున్నాయి. మరో ఇద్దరికి ఇవ్వకున్నా,ఈటల రాజేందర్‌కు వస్తుందనే ప్రచారం ఉండే. ఆయన బీఆరెస్ పార్టీని వీడిన తరువాత అమిత్ షా అభయం మేరకే బీజేపీలో చేరారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి ఆయన ఎంపీగా గెలిచారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఆయనకు అపార అనుభవం ఉంది. బీసీ ముదిరాజ్ కులానికి చెందిన ఈటల రాజేందర్‌కు మాస్ లీడర్‌గా మంచి ఫాలోయింగ్ ఉంది. ఆయన సతీమణి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఆ వర్గం నుంచి కూడా ఈటల రాజేందర్‌కు బలమైన మద్దతు లభిస్తోంది.ఈ నేపథ్యంలో ఈటల రాజేందర్‌కు మంత్రి పదవి ఇస్తే పార్టీని మరింత బలోపేతం దిశగా తీసుకెళ్తాడని, బీజేపీని తెలంగాణలో అధికారంలోకి తీసుకురావడం పక్కా అనే సమాచారం కేంద్రానికి ఎప్పటికప్పుడు చేరవేస్తూనే ఉన్నారు. మోడీ, అమిత్ షాలు కూడా ఈటలకు ప్రామిస్ చేసి ఉన్న నేపథ్యంలో సమయం కోసం చూస్తున్నారు.ఇప్పటికే ఆయన్ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని చేయాలనే ఆలోచన చేసింది అధిష్టానం. కానీ ఇక్కడ కిషన్‌రెడ్డి అడ్డు తగిలాడు. మధ్యే మార్గంగా రాంచంద్రారావును తీసుకొచ్చి, ఆయనకు అధ్యక్ష పగ్గాలు అందించారు. అప్పట్నుంచి పూర్తిగా డిసాప్పాయింటెడ్‌గానే ఉన్నాడు ఈటల. తన పనేదో తాను చేసుకుంటూ పోతున్నాడు. ఎక్కడా వివాదాలు లేవు. పెద్దగా వార్తల్లో లేడు.తన అనుచరగణాన్ని కాపాడుకుంటూ వస్తున్నాడు. పార్టీలో కూడా క్రియాశీలకంగా కనిపించడం లేదు.ఇక్కడి నేతలపై అలకపాన్పెక్కిన ఈటలకు మంత్రి పదవి ఇవ్వడం మూలంగా ఆయన నాయకత్వానికి, పార్టీకి కూడా బూస్టింగ్ ఇచ్చినట్టవుతుందని భావిస్తోంది అధిష్టానం. ఇక డీకే అరుణకు ఇవ్వడం ద్వారా రెడ్డి సామాజికవర్గాన్ని మచ్చిక చేసుకుని పార్టీని అధికారంలోకి తీసుకురావాలనే ఆలోచన ఉంది. డీకే అరుణ మహబూబ్ నగర్ నుంచి ఎంపీగా ఉన్నారు. పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కూడా సేవలందిస్తున్నారు

## ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడుల బాట..

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలపై ఈ విద్యా సంవత్సరంలో తల్లిదండ్రుల విశ్వాసం గణనీయంగా పెరిగినట్లు కనిపిస్తోంది. గతంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ విద్యాసంస్థలకు విద్యార్థులు వెళ్లడం సాధారణంగా కనిపించేది. అయితే ఈసారి పరిస్థితి భిన్నంగా మారింది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం విద్యారంగంలో కొత్త మార్పుకు సంకేతంగా భావిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం లక్షకు పైగా విద్యార్థులు ప్రభుత్వ బడులను ఎంచుకున్నట్లు తెలుస్తోంది.ఈ చేరికల పెరుగుదలకు ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలు ప్రధాన కారణంగా నిలిచాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా 'బడి పిలుస్తోంది కార్యక్రమం ద్వారా గ్రామాలు, పట్టణాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడం వల్ల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగిందని అభిప్రాయపడుతున్నారు. పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నాణ్యమైన బోధన గురించి ప్రజలకు వివరించడం కూడా సానుకూల ఫలితాలను ఇచ్చిందని చెబుతున్నారు.అంతేకాకుండా 'మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్స్ నిర్వహించడం ద్వారా తల్లిదండ్రులను పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములను చేశారు. పిల్లల చదువు, పాఠశాల నిర్వహణ, అవసరమైన వసతులపై నేరుగా అభిప్రాయాలు తెలుసుకోవడం వల్ల పరస్పర నమ్మకం పెరిగింది. ఈ విధానం ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రజల్లో మంచి అభిప్రాయాన్ని తీసుకువచ్చిందని అధికారులు భావిస్తున్నారు.ఇక ప్రైవేట్ పాఠశాలల్లో పెరుగుతున్న ఫీజులు కూడా చాలా కుటుంబాలకు భారంగా మారుతున్నాయి. దీంతో నాణ్యమైన విద్యతో పాటు తక్కువ ఆర్థిక భారం ఉండే ప్రభుత్వ పాఠశాలలను చాలా మంది తల్లిదండ్రులు ఎంచుకుంటున్నారని తెలుస్తోంది. ఇదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన, పరీక్షల్లో మంచి ఫలితాలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు కూడా ఈ మార్పుకు కారణమయ్యాయి.ప్రభుత్వం ఉపాధ్యాయులను ప్రోత్సహించే చర్యలు కూడా తీసుకుంది. పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు సాధించిన విజయాలను విస్తృతంగా ప్రచారం చేయడం వల్ల ఉపాధ్యాయుల్లో ఉత్సాహం పెరిగిందని విద్యావర్గాలు చెబుతున్నాయి. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయి.పాఠశాలల అభివృద్ధి కోసం మరో కీలక నిర్ణయంగా 159 ప్రభుత్వ పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా అభివృద్ధి చేయడానికి ఎంపిక చేశారు. మెరుగైన తరగతి గదులు, అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక బోధనా పద్ధతులతో వీటిని తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.అదే విధంగా లీప్ పాఠశాలల్లో 9వ, 10వ తరగతి విద్యార్థులకు గణితం, సైన్స్ విషయాల్లో కృత్రిమ మేధస్సు ఆధారిత ఏఐ ట్యూటర్ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. తొలి దశలో 175 పాఠశాలల్లో ఈ ప్రాజెక్టును ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. విద్యార్థులు క్లిష్టమైన అంశాలను సులభంగా అర్థం చేసుకునేలా ఈ సాంకేతికత ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్యలతో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతోంది. నాణ్యమైన విద్య, ఆధునిక సౌకర్యాలు, సాంకేతికత వినియోగం, ఉపాధ్యాయుల కృషి కలిసి ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సానుకూల మార్పులకు దారి తీస్తున్నాయని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు

# బరువు తగ్గించడంలో సబ్జా గింజలు లేదా చియా విత్తనాలు





బరువు తగ్గాలని ప్రయత్నించే వారు ఇటీవల ఎక్కువగా చియా గింజలు, సబ్జా గింజలను ఆహారంలో చేర్చుకుంటున్నారు. నీటిలో నానబెట్టినప్పుడు రెండూ ఒకేలా కనిపించినప్పటికీ, వీటి ప్రయోజనాలు కొంత భిన్నంగా ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పొట్ట చుట్టూ పేరుకుపోయే కొవ్వును తగ్గించడంలో ఈ రెండు గింజలు వేర్వేరు విధాలుగా పనిచేస్తాయని వివరిస్తున్నారు. అయితే ఇవి నేరుగా కొవ్వును కరిగించవని, సరైన ఆహారం, వ్యాయామంతో కలిపి తీసుకున్నప్పుడు మాత్రమే ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు. చియా గింజల్లో సొల్యూబుల్ ఫైబర్, ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్లు, ప్లాంట్ బేస్డ్ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి నీటిలో నానిన తర్వాత జెల్‌లా మారి జీర్ణక్రియను నెమ్మదింపజేస్తాయి. దీంతో ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉండటానికి సహాయపడతాయి. ఫైబర్ అధికంగా ఉండే ఆహారం బరువు నియంత్రణలో సహాయపడుతుందని పరిశోధనలు కూడా సూచిస్తున్నాయి. చియా గింజలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల నడుము చుట్టుకొలత కొంతవరకు తగ్గే అవకాశం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి.

**గింజల ప్రభావం..**

అయితే చియా గింజల ప్రభావం నెమ్మదిగా కనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలికంగా సమతుల ఆహారం, వ్యాయామంతో కలిపి తీసుకుంటేనే మంచి ఫలితాలు వస్తాయని సూచిస్తున్నారు. కేవలం చియా గింజల వల్ల మాత్రమే బరువు తగ్గిపోదని స్పష్టం చేస్తున్నారు. సబ్జా గింజలు లేదా బేసిల్ సీడ్స్‌లో కూడా ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇవి నీటిలో చాలా వేగంగా జెల్ లా మారుతాయి. దీంతో కడుపు నిండిన భావన త్వరగా కలుగుతుంది. ఇది ఎక్కువగా తినే అలవాటును తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే అసిడిటీ, కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలను తగ్గించడంలో కూడా సబ్జా గింజలు ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. చాలామంది పొట్ట ఉబ్బరాన్ని కూడా పొట్ట కొవ్వుగా భావిస్తారని, ఇలాంటి సందర్భాల్లో సబ్జా గింజలు తక్షణ ఉపశమనం ఇస్తాయని ఆరోగ్య నిపుణులు వివరిస్తున్నారు. అయితే ఇవి నేరుగా కొవ్వును కరిగించవని, ఆకలి నియంత్రణ, జీర్ణక్రియ మెరుగుదల ద్వారా బరువు నియంత్రణకు సహాయపడతాయని చెబుతున్నారు.

**ఏవి ఉత్తమం..**

నిపుణుల ప్రకారం చియా గింజలు దీర్ఘకాలిక బరువు నియంత్రణ, మెటబాలిజం మెరుగుదల కోసం ఉపయోగపడితే, సబ్జా గింజలు తక్షణ ఆకలి నియంత్రణ, జీర్ణక్రియ సౌకర్యం కోసం ఎక్కువగా సహాయపడతాయి. అందుకే చాలా మంది పోషకాహార నిపుణులు ఈ రెండింటినీ మారుస్తూ తీసుకోవాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా ఈ గింజలను ఉపయోగించే విధానం కూడా ముఖ్యమని చెబుతున్నారు. ఒకటి లేదా రెండు టీస్పూన్ల గింజలను నీటిలో నానబెట్టి తీసుకోవాలి. నిమ్మరసం, స్మూతీలు, పెరుగులో కలిపి తీసుకోవచ్చు. అయితే ఎప్పుడూ పొడిగా తినకూడదని హెచ్చరిస్తున్నారు. అలాగే ఇవి భోజనానికి ప్రత్యామ్నాయం కాదని, సమతుల ఆహారంలో భాగంగా మాత్రమే తీసుకోవాలని సూచిస్తున్నారు. సబ్జా గింజలు, చియా గింజలు రెండూ ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాలే. కానీ పొట్ట కొవ్వు తగ్గించడంలో వీటి ప్రభావం జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వ్యాయామంపై కూడా ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్యకరమైన జీవనశైలి పాటిస్తేనే మంచి ఫలితాలు కనిపిస్తాయని వారు సూచిస్తున్నారు.

## మామిడి పండు.. రుచికే కాదు, ఆరోగ్యానికి మేటి!

వేసవి వచ్చిందంటే చాలు.. నోరూరించే మామిడి పండ్ల సువాసనలు పలకరిస్తాయి. పండ్లలో రారాజుగా పిలుచుకునే మామిడి కేవలం రుచికే కాదు, పోషకాల విషయంలోనూ మేటి. విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లకు నిలయమైన ఈ పండును సరైన పద్ధతిలో, మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

**రోగనిరోధక శక్తికి ప్రధానం..**

మామిడి పండులో విటమిన్-సి, విటమిన్-ఎ పుష్కలంగా ఉంటాయి. ప్రతి 100 గ్రాముల మామిడిలో సుమారు 36 మిల్లీగ్రాముల విటమిన్-సి ఉంటుంది. ఇది శరీర రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసి, ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా కాపాడుతుంది. మామిడిలోని విటమిన్-సి శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. దీనివల్ల చర్మం ఆరోగ్యంగా ఉండటమే కాకుండా, కణజాల మరమ్మత్తు వేగంగా జరుగుతుంది. మామిడిలో ఉండే విటమిన్-ఎ కంటిచూపు మెరుగుపడటానికి ఎంతగానో దోహదపడుతుంది. రేచీకటి వంటి సమస్యలను నివారించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

**వ్యాధులకు చెక్..**

ఇందులో ఉండే మాంగిఫెరిన్, క్వెర్సెటిన్, బీటా-కెరోటిన్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. తద్వారా ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ముప్పును తగ్గిస్తాయి. మామిడి పండులో ఫైబర్ తోపాటు కొన్ని సహజ ఎంజైమ్‌లు ఉంటాయి. ఇవి జీర్ణక్రియ సజావుగా సాగేలా చేస్తాయి. అయితే, వీటిని మితంగా తీసుకోవాలి. అధికంగా తింటే గ్యాస్, కడుపు ఉబ్బరం లేదా విరేచనాల వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

**తక్షణ శక్తి.. ఎలక్ట్రోలైట్ల సమతుల్యత..**

వేసవిలో చెమట రూపంలో శరీరం నీటిని, లవణాలను కోల్పోతుంది. మామిడిలో ఉండే సహజ చక్కెరలు ఫ్రక్టోజ్, గ్లూకోజ్ శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ఇందులోని పొటాషియం, మెగ్నీషియం మూలకాలు శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడి, కండరాలు, నరాలు చురుగ్గా పనిచేసేలా చూస్తాయి.

**మధుమేహులు, బరువు తగ్గేవారు జాగ్రత్త..!**

మామిడి పండ్లు ఎంత ఆరోగ్యకరమైనా.. కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి. మామిడిలో సహజ చక్కెరలు, కేలరీలు అధికంగా ఉంటాయి. కాబట్టి మధుమేహం ఉన్నవారు వైద్యుల సలహా మేరకు చాలా పరిమితంగా తీసుకోవాలి. అతిగా మామిడి పండ్లు తింటే బరువు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి వీటిని ఆహారంలో భాగంగా తీసుకునేటప్పుడు పరిమాణంపై దృష్టి పెట్టడం ముఖ్యం. మామిడి పండు ప్రకృతి ప్రసాదించిన అద్భుతమైన వరం. దీనిని మితంగా ఆస్వాదిస్తూ, వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకుందాం..!



# మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవాల్సిన సరైన పోషకాలు ఇవే..!

సాక్షి లైఫ్ : మగువలు ప్రతి వయసులోనూ తమ ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఇంటి బాధ్యతల్లో పడి సొంత ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసే మహిళలు.. ఈ పోషకాలను తమ మెనూలో చేర్చుకోవడం ద్వారా నిత్యం ఉత్సాహంగా ఉండవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. కుటుంబం అంతటి ఆరోగ్యాన్ని చూసుకునే మహిళలు, తమ పోషణ విషయంలో మాత్రం తరచుగా అశ్రద్ధ చూపుతుంటారు. వయసుతో పాటు వచ్చే శారీరక మార్పులు, హార్మోన్ల అసమతుల్యతను తట్టుకోవాలంటే సరైన ఆహారం తీసుకోవడం అనివార్యం. మహిళా లోకం తమ డైట్‌లో తప్పనిసరిగా చేర్చుకోవాల్సిన ముఖ్యమైన పోషకాలు ఇవే..

1. ప్రోటీన్.. కండరాల పటుత్వానికి..

కండరాల నిర్మాణానికి, శరీరానికి అవసరమైన శక్తిని అందించడానికి ప్రోటీన్ ఎంతో అవసరం.
వనరులు..పప్పుధాన్యాలు, గుడ్లు, జున్ను (పన్నీర్), సోయా, చికెన్.
ప్రయోజనం..ఇది శరీర దృఢత్వాన్ని పెంచుతుంది మరియు త్వరగా అలసిపోకుండా కాపాడుతుంది.

2. ఐరన్ రక్తహీనతకు చెక్..!

భారతీయ మహిళల్లో రక్తహీనత (ూఅవఎఱ) అనేది ప్రధాన సమస్య. శరీరంలో రక్తం పెరగడానికి, ఆక్సిజన్ సరఫరా సక్రమంగా జరగడానికి ఐరన్ కీలకం.
వనరులు: పాలకూర వంటి ఆకుకూరలు, బీన్స్, రాజ్మా, ఖర్జూరం మరియు ఎర్ర మాంసం.
ప్రయోజనం: నీరసం, తల తిరగడం వంటి సమస్యలను నివారించి రోజంతా చురుగ్గా ఉంచుతుంది.



3. కాల్షియం ఓ విటమిన్-డి: ఎముకల బలానికి..

వయసు పెరిగే కొద్దీ మహిళల్లో ఎముకల సాంద్రత తగ్గి 'ఆస్టియోపోరోసిస్' వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది.
కాల్షియం.. పాలు, పెరుగు, బాదం, ఆకుకూరల్లో లభిస్తుంది.
విటమిన్ డి..ఇది ఎముకలు కాల్షియాన్ని గ్రహించడంలో సహాయపడుతుంది. సూర్యరశ్మి, పుట్టగొడుగులు, పాలు దీనికి ప్రధాన వనరులు.

4. విటమిన్ సి..చర్మ సౌందర్యం.. రోగనిరోధక శక్తి..

చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా, శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో విటమిన్-సి ముందుంటుంది.
వనరులు.. ఉసిరి, నారింజ, కివీ, స్ట్రాబెర్రీ, నిమ్మజాతి ఫలాలు.
ప్రయోజనం.. ఇవి ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పించడంతో పాటు చర్మంపై ముడతలు రాకుండా కాపాడుతాయి.

5. ఫైబర్.. జీర్ణక్రియ మెరుగుదలకు..

మలబద్ధకం వంటి జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేయడానికి ఫైబర్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. వనరులు.. ఓట్స్, బ్రౌన్ రైస్, తాజా పండ్లు,కూరగాయలు.
ప్రయోజనం.. ఇవి బరువును నియంత్రించడమే కాకుండా శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతాయి. సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు రోజూ తగినంత నీరు తాగడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల మహిళలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండడానికి వీలు కలుగుతుంది.

## రోజంతా ఎల్లప్పుడూ అలసటగా అనిపించే మహిళలు.. ఇలా చేయాలి



ఉదయం నిద్రలేచినప్పటి నుంచే అలసటగా అనిపించడం, రోజంతా నీరసంగా ఉండటం, ఏ పని చేసినా త్వరగా శక్తి తగ్గిపోవడం వంటి సమస్యలను చాలామంది మహిళలు సాధారణంగా తీసుకుంటుంటారు. ఇంటి పనులు, ఉద్యోగ ఒత్తిడి, నిద్రలేమి కారణంగానే ఇలా జరుగుతుందని భావిస్తారు. అయితే నిరంతర అలసట వెనుక శరీరంలో జరుగుతున్న కొన్ని ముఖ్యమైన మార్పులు కారణమై ఉండొచ్చని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఐరన్ లోపం, హార్మోన్ల అసమతుల్యత, థైరాయిడ్ సమస్యలు, ఒత్తిడి వంటి అంశాలు మహిళల శక్తిస్థాయిలపై తీవ్ర ప్రభావం చూపుతాయని చెబుతున్నారు. శరీరానికి అవసరమైన ఆక్సిజన్‌ను కణాలకు చేరవేయడంలో ఐరన్ కీలక పాత్ర పోషిస్తుంది. ఐరన్ తక్కువగా ఉన్నప్పుడు హిమోగ్లోబిన్ స్థాయిలు పడిపోతాయి. దీంతో అలసట, బలహీనత, తల తిరగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు కనిపిస్తాయి. ముఖ్యంగా భారతదేశంలో మహిళల్లో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉందని ఆరోగ్య సర్వేలు చెబుతున్నాయి. తక్కువ స్థాయి ఐరన్ లోపం ఉన్నప్పటికీ అలసట తీవ్రంగా అనిపించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**గుర్తించడం కష్టమే..**

మహిళల్లో నెలసరి సమయంలో రక్తనష్టం జరగడం, గర్భధారణ సమయంలో పోషక అవసరాలు పెరగడం, ఐరన్ అధికంగా ఉన్న ఆహారం తక్కువగా తీసుకోవడం వంటి కారణాల వల్ల ఐరన్ లోపం ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే క్రమం తప్పకుండా హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకోవడం అవసరమని సూచిస్తున్నారు. హార్మోన్లు కూడా మహిళల శక్తి స్థాయిలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. నెలసరి చక్రంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ హార్మోన్ల మార్పుల వల్ల అలసట, చిరాకు, నిద్రలేమి, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు వస్తాయి. ముఖ్యంగా పీరియడ్స్‌కు ముందు ఈ లక్షణాలు మరింత ఎక్కువగా కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే థైరాయిడ్ గ్రంథి పనితీరు తగ్గినప్పుడు కూడా శరీరంలో మెటబాలిజం నెమ్మదిస్తుంది. దీనివల్ల అలసట, బరువు పెరగడం, చలి ఎక్కువగా అనిపించడం, ఆలోచనా శక్తి మందగించడం వంటి సమస్యలు వస్తాయి. హైపోథైరాయిడిజం మహిళల్లో ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ ప్రారంభ దశలో లక్షణాలు సాధారణ అలసటలా ఉండటంతో చాలామంది గుర్తించలేకపోతున్నారు.

**ఒత్తిడి అధికంగా ఉంటే..**

ఒత్తిడి కూడా మహిళల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఎక్కువకాలం మానసిక ఒత్తిడిలో ఉంటే కార్టిసోల్ హార్మోన్ స్థాయిలు పెరిగి నిద్ర చక్రాన్ని దెబ్బతీస్తాయి. సరిపడా నిద్రపోయినా అలసట తగ్గకపోవడం, రోజంతా శక్తిలేకపోవడం వంటి సమస్యలు దీనివల్ల వస్తాయి. ఐరన్ లోపం, హార్మోన్ల అసమతుల్యత ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అధిక రక్తస్రావం వల్ల ఐరన్ నిల్వలు తగ్గిపోతాయి. మరోవైపు హార్మోన్ల మార్పులు ఆకలి, జీర్ణక్రియ, పోషకాల శోషణపై ప్రభావం చూపుతాయి. దీంతో అలసట మరింత పెరిగే అవకాశం ఉంటుంది. జీవనశైలి కూడా అలసటకు ప్రధాన కారణంగా మారుతోంది. సమయానికి ఆహారం తీసుకోకపోవడం, ఆకుకూరలు, పప్పులు, ప్రోటీన్ అధికంగా ఉన్న ఆహారం తక్కువగా తీసుకోవడం, వ్యాయామం లేకపోవడం, సరైన నిద్ర లేకపోవడం వంటి అలవాట్లు శరీర శక్తిని తగ్గిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**ఈ సూచనలు పాటించాలి..**

నిరంతర అలసటను తగ్గించడానికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, ఐరన్, థైరాయిడ్ స్థాయిలను పరిశీలించడం, సమతుల ఆహారం తీసుకోవడం, ఒత్తిడిని నియంత్రించడం, సరైన నిద్రపోవడం చాలా ముఖ్యమని సూచిస్తున్నారు. వైద్యుల సలహా లేకుండా సప్లిమెంట్లు తీసుకోవద్దని హెచ్చరిస్తున్నారు. నిరంతర అలసటను సాధారణ సమస్యగా తీసుకోవడం సరైంది కాదని ఇది శరీరం ఇచ్చే హెచ్చరిక సంకేతంగా భావించాలని నిపుణులు చెబుతున్నారు. సరైన సమయంలో కారణాన్ని గుర్తించి చికిత్స తీసుకుంటే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను నివారించడంతోపాటు జీవన నాణ్యతను మెరుగుపరచుకోవచ్చని వారు సూచిస్తున్నారు.

## బిజినెస్

### ఈ-కామర్స్ సంస్థల ఆఫర్లు షురూ
### జూలై 4 నుంచి అమెజాన్ ప్రైమ్‌డే




**న్యూఢిల్లీ :** ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మళ్లీ ప్రైమ్‌డే ఉత్సవాన్ని జరుపుకోనున్నట్టు ప్రకటించింది. జూలై 4 నుంచి 6 వరకు మూడు రోజుల పాటు జరుగనున్న పదో ఎడిషన్ ప్రైమ్‌డే ఉత్సవాల్లో అన్ని రకాల ఉత్పత్తులపై భారీ రాయితీలను అందించనున్నది. ప్రైమ్ మెంబర్లకు అన్ని రకాల ఉత్పత్తులపై 60 శాతం వరకు రాయితీ లభించనున్నది. ప్రైమ్ మెంబర్లపై వసూలు చేసే ఫీజును రూ.500 తగ్గించింది. దీంతో రూ.999 చెల్లించి ప్రైమ్ మెంబర్లుగా చేరవచ్చునని తెలిపింది. కస్టమర్ల అదేరోజు, ఆ తర్వాతి రోజు అందించడానికి ఇప్పటికే వేలాది మంది తాత్కాలిక ఉద్యోగులను నియమించుకున్నది.జు-జశీఎఎవతీఎవ ాావతీజఅఎవం

**28 నుంచి జియోమార్ట్ ఆఫర్లు**

దేశంలో అతిపెద్ద డిజిటల్ కామర్స్ సేవలు అందించే జియోమార్ట్..ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు దిగి ఉత్సవ్ పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఆఫర్ల కింద గృహోపకరణాలు, హోమ్ కేర్ ఎలక్ట్రానిక్స్, టెక్నాలజీ యాక్సెసరీస్, ఎంపిక చేసిన 5జీ స్మార్ట్‌ఫోన్లను తక్కువ ధరకే విక్రయిస్తున్నది. రూ.12,499కే పోకో ఫోన్, రూ.19,999కే సామ్‌సంగ్ గెలాక్సీ ఎఫ్35 స్మార్ట్‌ఫోన్‌ను అందించనున్నది.

### 60 కోట్లతో పెగాసిస్టమ్ జీసీసీ

**బెంగళూరు :** హైదరాబాద్ కేంద్రంగా ఐటీ సేవలు అందిస్తున్న పెగాసిస్టమ్స్..రూ.60 కోట్ల పెట్టుబడితో బెంగళూరులో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్(జీసీసీ)ని ప్రారంభించింది. ఈ సందర్భంగా కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ విశ్వేశరయ్య మాట్లాడుతూ..ప్రపంచవ్యాప్తంగా ఏఐ టెక్నాలజీకి పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ జీసీసీని నెలకొల్పినట్టు, తద్వారా పలువురు టెక్నాలజీ నిపుణులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో 38 శాతం ఈ సెంటర్ నుంచి ఆశిస్తున్నట్టు చెప్పారు. బ్యాంక్స్, టెలికాం, హెల్త్‌కేర్ సంస్థలకు టెక్నాలజీ సేవలు అందిస్తున్నట్టు తెలిపారు

# మోదీ మాట..
# రూ.13 వేలు తగ్గిన గోల్డ్ రేటు!

భారతదేశంలో ఇటీవల బంగారం, వెండి ధరలు గణనీయంగా తగ్గాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. పౌరులను ఒక సంవత్సరం పాటు బంగారం కొనుగోళ్లను వాయిదా వేయాలని చేసిన సూచన తర్వాత ఈ మార్పు చోటుచేసుకుందని నిపుణులు చెబుతున్నారు. మే 10న ప్రధానమంత్రి బంగారం కొనుగోలును ఒక ఏడాది వాయిదా వేయాలని చెప్పినప్పుడు, 24 క్యారెట్ బంగారం ధర 10 గ్రాములకు సుమారు రూ.1,53,140గా ఉండగా, వెండి ధర కేజీ సుమారు రూ.2,62,350గా ఉంది. అయితే నేటికి (జూన్ 28) ఆ ధర బంగారం ధర రూ.1,39,873కి తగ్గగా, వెండి ధర రూ.2,16,541కి పడిపోయింది. అంటే.. మోదీ ప్రకటన తరువాత గోల్డ్ రేటు సుమారు రూ.13,267 తగ్గగా, వెండి దాదాపు రూ.45,809 తగ్గింది. భారత్‌లో బంగారం దిగుమతులు ఎక్కువగా ఉండటం వల్ల విదేశీ మారక ద్రవ్యంపై భారీ ఒత్తిడి పడుతోంది. ఈ పరిస్థితుల్లో విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడానికి ప్రధాని మోదీ ప్రజలను ఉద్దేశించి అవసరం ఉంటే తప్పా.. బంగారం కొనుగోళ్లు, విదేశీ ప్రయాణాలను వాయిదా వేయాలని కోరారు. ప్రధాని విజ్ఞప్తి తరువాత ప్రభుత్వం బంగారం, వెండి దిగుమతి సుంకాన్ని 6 శాతం నుంచి 15 శాతానికి పెంచింది. దీని ద్వారా దిగుమతులను తగ్గించడంతో పాటు.. దేశీయ



మార్కెట్‌పై నియంత్రణ సాధించాలని భావించారు. అనుకున్న విధంగానే.. ఈ నిర్ణయం వినియోగదారులపై తక్షణ ప్రభావం చూపించిందని తెలుస్తోంది.

# క్విడ్ ఫేస్‌లిఫ్ట్.. లాంచ్ డేట్ ఫిక్స్!

రెనాల్ట్ తన ఎంట్రీ-లెవల్ హ్యాచ్‌బ్యాక్ అయిన అప్‌డేటెడ్ క్విడ్ ఫేస్‌లిఫ్ట్‌ను జూలై 3న భారతదేశంలో విడుదల చేయనుంది. దశాబ్దానికి పైగా దేశంలో అమ్ముడవుతున్న క్విడ్ కారు కంపెనీకి చెందిన పాపులర్ మోడల్‌గా కొనసాగుతూ, దాని లైనప్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. క్విడ్ ఫేస్‌లిఫ్ట్ కారుకు సంబంధించిన వివరాలను కంపెనీ అధికారికంగా వెల్లడించలేదు. అయితే.. ఇటీవల టెస్టింగ్ సమయంలో కనిపించిన స్పై షాట్‌లు ఫేస్‌లిఫ్ట్ క్విడ్ పూర్తిస్థాయి రీడిజైన్‌కు బదులుగా సూక్ష్మమైన స్టైలింగ్ మార్పులను పొందుతుందని సూచిస్తున్నాయి. వెహికల్ ముందు భాగం, రెనాల్ట్ బ్యాడ్జ్, టెయిల్ ల్యాంప్‌ల చుట్టూ క్యామోఫ్లాజ్‌తో కనిపించాయి. కాబట్టి ఇది కీలకమైన విజువల్ ఎలిమెంట్స్‌లో అప్‌డేట్‌లను సూచిస్తుంది. అప్డేటెడ్ మోడల్‌లో కొత్త గ్రిల్, బంపర్‌లు, కొత్త లైటింగ్ అంశాలు ఉంటాయని భావిస్తున్నారు. ఈ డిజైన్ డాసియా స్ప్రింగ్ ఈవీ నుంచి ప్రేరణ పొందవచ్చని, తద్వారా క్విడ్‌ను.. రెనాల్ట్ అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ డిజైన్ లాంగ్వేజ్‌కు అనుగుణంగా మార్చవచ్చని కూడా నివేదికలు సూచిస్తున్నాయి. లోపలి భాగంలో.. మొత్తం క్యాబిన్



అనుభవాన్ని మెరుగుపరచడానికి క్విడ్ ఫేస్‌లిఫ్ట్ కొన్ని చిన్న అప్‌డేట్‌లను పొందుతుందని సమాచారం. అధికారిక ఫీచర్ల జాబితా ఏదీ వెల్లడించనప్పటికీ, అప్‌డేటెడ్ మోడల్‌లో పెద్ద టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, ఫుల్లీ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ లభించే అవకాశం ఉంది. ఇంజిన్ పరంగా.. క్విడ్ ఫేస్‌లిఫ్ట్‌లో ఎలాంటి మార్పులు ఉండే అవకాశం లేదు. ఇది ప్రస్తుతం ఉన్న 1.0-లీటర్, త్రీ సిలిండర్ న్యాచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్‌తోనే కొనసాగుతుందని భావిస్తున్నారు. ఈ ఇంజిన్ 65 ఎప్త్రజూ పవర్, 96 చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లు కూడా అలాగే ఉంటాయని అంచనా వేస్తున్నారు, కొనుగోలుదారులు 5 స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్, 5 స్పీడ్ ాామీ మధ్య ఎంచుకోవచ్చు. కంపెనీ ఈ కారు ధరలను లాంచ్ సమయంలో వెల్లడించనుంది. ఇది ఎంట్రీ-లెవల్ హ్యాచ్‌బ్యాక్ విభాగంలో మారుతి సుజుకి ఆల్టో కె10, మారుతి సుజుకి సెలెరియో వంటి ప్రత్యర్థులతో పోటీని కొనసాగించనున్నట్లు సమాచారం.

# భారత్ ఇంటికి.. వరల్డ్ కప్‌లో
# ముగిసిన అమ్మాయిల కథ

ఆస్ట్రేలియా చేతిలో ఓటమి

**లండన్ :** మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత అమ్మాయిల కథ ముగిసింది. సెమీస్ చేరాలంటే తప్పక గెలవాల్సిన పోరులో టీమిండియా.. 6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడి గ్రూప్ దశలోనే ఇంటిబాట పట్టింది. భారత్ నిర్దేశించిన 171 పరుగుల లక్ష్యాన్ని కంగారూలు.. 19 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించారు. ఎలీస్ పెర్రీ (38 బంతుల్లో 56, 8 ఫోర్లు), ఆల్‌రౌండర్ ఆష్లీ గార్డ్‌నర్ (29 బంతుల్లో 53 నాటౌట్, 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ మెరుపులతో టీ20 ప్రపంచకప్‌లో ఉమెన్ ఇన్ బ్లూకు నిరాశ తప్పలేదు. బౌలింగ్ వైఫల్యంతో భారత్ భారీ మూల్యం చెల్లించుకుంది. అంతకుముందు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (27 బంతుల్లో 56, 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకానికి తోడు స్మృతి మంధాన (38), షెఫాలీ వర్మ (34), జెమీమా రోడ్రిగ్స్ (34) రాణించడంతో భారత్.. నిర్ణీత ఓవర్లలో 170/4 పరుగులు చేసింది. ఈ ఓటమితో భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించగా గ్రూప్-ఏ నుంచి ఆస్ట్రేలియా (10 పాయింట్లు), దక్షిణాఫ్రికా (8 పాయింట్లు) సెమీస్‌కు దూసుకెళ్లాయి. అంతకుముందు సఫారీ జట్టు.. 4 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించి సెమీస్ మార్గాన్ని సుగమం చేసుకుంది.

**విజయాన్ని దూరం చేసిన పెర్రీ, ఆష్లీ**

టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్ బ్యాటింగ్‌లో ఫర్వాలేదనిపించింది. గత మ్యాచ్‌లతో పోలిస్తే కీలక పోరులో ఓపెనర్లతో పాటు మిడిలార్డర్‌లో హర్మన్‌ప్రీత్ దూకుడుగా ఆడి జట్టుకు భారీ స్కోరును అందించింది. ఇక ఛేదనలో 4 పరుగులకే ఆసీస్ తొలి వికెట్ కోల్పోగా మూనీ (22), లిచ్‌ఫీల్డ్ (24) నిలకడగా ఆడి ఆ జట్టును పోటీలోకి తెచ్చారు. ఈ ఇద్దరి నిష్క్రమణ తర్వాత వచ్చిన పెర్రీ, ఆష్లీ భారత్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా పనిపూర్తిచేశారు. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 57 బంతుల్లోనే వంద పరుగులు జోడించి భారత్‌కు విజయాన్ని దూరం చేశారు.



సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లకు 170/4 (హర్మన్‌ప్రీత్ 56, స్మృతి 38, మొలినొ 2/46)

ఆస్ట్రేలియా: 19 ఓవర్లకు 172/4 (పెర్రీ 56, ఆష్లీ 53లి, చరణి 2/32, దీప్తి 1/31)

### రగ్బీ విజేత హైదరాబాద్

హైదరాబాద్, ఆట ప్రతినిధి : సొంతగడ్డపై జరిగిన రగ్బీ ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) రెండో సీజన్‌లో హైదరాబాద్ హీరోస్ విజేతగా నిలిచింది. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో పూర్తి ఏకపక్షంగా సాగిన ఫైనల్‌లో హైదరాబాద్.. 41-17తో ముంబై డ్రీమర్స్‌ను ఓడించి రెండో సీజన్ టైటిల్ గెలుచుకుంది. ఆట ఆరంభంలో డ్రీమర్స్ ఆధిపత్యం ప్రదర్శించినప్పటికీ తర్వాత పుంజుకున్న హైదరాబాద్.. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వలేదు. ఆట అర్ధభాగం ముగిశాక హీరోస్ మ్యాచ్‌పై పూర్తిస్థాయిలో పట్టుసాధించి చాంపియన్‌గా నిలిచింది. మూడో స్థానం కోసం జరిగిన పోరులో బెంగళూరు బ్రేవ్ హార్ట్స్.. 22-19తో చెన్నై బుల్స్‌ను ఓడించింది.




## స్పోర్ట్స్

### వారెవ్వా ఐర్లాండ్.. టీమిండియాకు దిమ్మతిరిగే షాక్

**టీ20 సిరీస్ కైవసం**

**16 సిరీస్‌ల జైత్రయాత్రకు బ్రేక్**




**బెల్‌ఫాస్ట్ :** జూన్ 28, 2026.. ఐర్లాండ్ క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంకా పసికూనగానే చలామణి అవుతున్న ఆ జట్టు అద్భుతమే చేసింది. వరుసగా రెండు టీ20 ప్రపంచకప్ ఎడిషన్లలో మేటి జట్లను కంగుతినిపించిట్రోఫీలు గెలిచిన భారత జట్టుకు దిమ్మతిరిగే షాకిస్తూ రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం ఇక్కడ చివరి బంతి వరకూ రసవత్తరంగా సాగిన పోరులో ఐరిష్ జట్టు.. ఒక్క పరుగు తేడాతో టీమిండియాను చిత్తుచేసి సిరీస్‌ను కైవసం చేసుకుంది. ప్రత్యర్థి నిర్దేశించిన 154 పరుగుల ఛేదనలో మరోసారి బ్యాటింగ్ వైఫల్యంతో చేతులెత్తేసిన భారత్.. 153/9 వద్దే ఆగిపోయి ఓటమిని మూటగట్టుకుంది. తిలక్ వర్మ (46 బంతుల్లో 55, 3 ఫోర్లు, 1 సిక్స్), హర్షిత్ రాణా (10 బంతుల్లో 21, 2 ఫోర్లు, 1 సిక్స్) మినహా మిగిలినవారంతా మళ్లీ చేతులెత్తేశారు. గత మ్యాచ్‌లో భారత్‌ను దెబ్బకొట్టిన భారత సంతతి బౌలర్ జై మూంద్రా, మాథ్యూ హోలార్డ్ తలా మూడు వికెట్లతో మరోసారి ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. జైకే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ అవార్డులు లభించాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్.. హ్యారీ టెక్టర్ (53), బెంజిమిన్ (37) రాణించడంతో 154/8 చేసింది. ప్రిన్స్ యాదవ్ (3/22) మెరిశాడు.

**తిలక్, రాణా పోరాడినా..**

లక్ష్యం చిన్నదే అయినా ఛేదన తేలికేం కాదని భారత్‌కు తొలి ఓవర్లోనే తెలిసొచ్చింది. కొత్త బంతితో జై మరోసారి నిప్పులు చెరిగాడు. మొదటి బంతికే సంజూ శాంసన్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న అతడు.. నాలుగో బాల్‌కు అభిషేక్‌నూ పెవిలియన్‌కు పంపాడు. తన మరుసటి ఓవర్లో శ్రేయస్‌ను అద్భుతమైన బంతితో క్లీన్‌బౌల్డ్ చేశాడు. తిలక్‌తో సమన్వయ లోపంతో ఇషాన్ (12) రనౌట్ అయ్యాడు. వర్షం అంతరాయం తర్వాత తిరిగి ఆరంభమైన మ్యాచ్‌లో అక్షర్ (14), దూబే (20), విఫలమయ్యారు. ఫిఫ్టీ తర్వాత తిలక్ కూడా ఔట్ అవగా రాణా మెరుపులతో భారత్ విజయానికి చేరువైనా ఐదో బంతికి అతడు నిష్క్రమించడం పర్యాటక జట్టును దెబ్బతీసింది. ఈ ఓటమితో 16 ద్వైపాక్షిక సిరీస్ విజయాల భారత జైత్రయాత్రకు అడ్డుకట్ట పడింది. 2023 ఆగస్టు తర్వాత భారత జట్టు టీ20ల్లో సిరీస్ కోల్పోవడం ఇదే ప్రథమం. ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన సారథిగా నిలిచి భారత జట్టు పగ్గాలను అందుకున్న శ్రేయస్.. సిరీస్ ఓటమితో తన కెప్టెన్సీ కెరీర్‌ను ఆరంభించడం గమనార్హం.

సంక్షిప్త స్కోర్లు

ఐర్లాండ్: 20 ఓవర్లకు 154/8 (టెక్టర్ 53, కలిట్జ్ 37, ప్రిన్స్ 3/22, దూబె 2/25);
భారత్: 20 ఓవర్లకు 153/9 (తిలక్ 55, రాణా 21, హోలార్డ్ 3/26, జై 3/32)



## అదిరిపోయే రేంజ్‌లో ఆరంభం

దేశవ్యాప్తంగా రూపొందుతున్న ప్రతిష్టాత్మక పానిండియా చిత్రాల్లో ఎన్టీఆర్ 'డ్రాగన్' ఒకటి. 'కేజీఎఫ్' ఫేం ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇండియా లెవల్లో భారీ అంచనాలే ఉన్నాయి. ఈ సినిమా షూటింగ్ 50శాతం పూర్తయింది. ప్రస్తుతం ఎన్టీఆర్ ఎంట్రీ సీక్వెన్స్ కోసం భారీ సెట్ల నిర్మాణం జరుగుతున్నదని సమాచారం. ఈ సీక్వెన్స్‌లో తారక్ గెటప్ కొత్తగా ఉంటుందట. ఎన్టీఆర్ అభిమానులను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా ఈ లుక్‌ని ప్రశాంత్‌నీల్ డిజైన్ చేశారట. ఈ సీక్వెన్స్‌లో ఎన్టీఆర్‌తో పాటు నలభైమంది ఫైటర్స్ కూడా భాగం కానున్నారట. ఈ సీక్వెన్స్‌తో షెడ్యూల్ పూర్తవుతుందని, ఓ పాట షూట్‌తో నెక్స్ట్ షెడ్యూల్ మొదలవుతుందని ఇన్‌సైడ్ టాక్. సాధారణంగా ప్రశాంత్‌నీల్ సినిమా ఫ్రేమ్స్ అన్నీ బ్లాక్ అండ్ గ్రే షేడ్స్‌లో ఉంటాయి. కానీ ఈ సినిమాను మాత్రం ఆయన కలర్‌ఫుల్‌గా తెరకెక్కిస్తున్నారట. రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడు.

# వెంకటేశ్ అలా.. కల్యాణ్‌రామ్ ఇలా..

అగ్ర హీరోలు వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కాంబినేషన్‌లో అనిల్ రావిపూడి నిర్మిస్తున్న మల్టీస్టారర్ మూవీ ఈ నెల 22న లాంఛనంగా మొదలైన విషయం తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా షూటింగ్‌ని అనిల్ రావిపూడి స్టార్ట్ చేయనున్నారు. దీనికోసం ఇప్పటికే హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో భారీ సెట్‌ను కూడా నిర్మిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ లాంగ్ షెడ్యూల్‌లో వెంకటేష్, కల్యాణ్‌రామ్‌లపై కామెడీ సీన్స్‌తో పాటు ఓ పాటను కూడా షూట్ చేస్తారట. అంతేకాక, ప్రధాన తారాగణమంతా పాల్గొనగా కథలోని కీలక సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లోనే చిత్రీకరిస్తారని వినికిడి.

ఈ సినిమాలో వెంకటేష్ అల్ట్రా స్టైలిష్ లుక్‌లో కనిపిస్తారట. ఆ లుక్‌కి పూర్తి భిన్నంగా కల్యాణ్‌రామ్ లుక్ ఉంటుందని సమాచారం. కుటుంబ భావోద్వేగాలు, కామెడీ ఎలిమెంట్స్ మేళవింపుగా ఈ సినిమా ఉంటుందని తెలుస్తున్నది. నవంబర్‌లోపు షూటింగ్ పార్ట్ మొత్తం పూర్తి చేసి సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేయాలని అనిల్ రావిపూడి భావిస్తున్నారు. కీర్తి సురేశ్, కృతిశెట్టి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి 'జనవరి 13న విడుదల'అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నట్టు ఇప్పటికే వార్తలొచ్చాయి. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీత దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సాహు గారపాటి నిర్మాత.



# దేశభక్తి నేపథ్యంలో



కొనంకి కార్తీక్ హీరోగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'సోల్జర్'. '24ఐ7 ఆన్ డ్యూటీ' అనేది ఉపశీర్షిక. శ్రద్ధ ఖత్రి దర్శకత్వంలో కేవీ నాయుడు నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నది. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. శక్తివంతమైన సైనికుడిగా కనిపిస్తున్న కొనంకి కార్తీక్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. పోస్టర్‌లో కనిపిస్తున్న యుద్ధవాతావరణం, పోరాట ఛాయలు, రెపరెపలాడుతున్న త్రివర్ణ పతాకం సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి. దేశ భద్రతకోసం అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైనికులకు ఈ చిత్రం నివాళిగా నిలుస్తుందని, ఆద్యంతం దేశభక్తి నేపథ్యంలోనే ఈ సినిమా సాగుతుందని మేకర్స్ చెబుతున్నారు. ప్రియాంక వర్మ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సందీప్ బద్దుల, నిర్మాణం: కొనంకి ఎంటర్‌టైన్మెంట్స్.

## హృద్యమైన ప్రేమకథ



'కోర్ట్' ఫేమ్ శ్రీదేవి, ఏగన్, ఫెమినా జార్జ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ చిత్రం 'హైకూ'. యువరాజ్ చిన్నసామి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తిచేసుకుంది. కాలేజీ నేపథ్యంలో హృదయాన్ని కదిలించే భావోద్వేగాలతో సాగే చిత్రమిదని, యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులకు కూడా నచ్చుతుందని దర్శకుడు తెలిపారు. నేటి యువత మనోభావాలకు అద్దంపట్టే చిత్రమిదని, కథలోని కొత్తదనం ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుందని నిర్మాతలు డి.అరుళానందు, మాథేవో అరుళానందు తెలిపారు. అదిర్బి అరుణ్, మైమ్ గోపి, ఇందుమతి, జెన్సన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ప్రియేష్ గురుస్వామి, సంగీతం: సిద్ధుకుమార్, దర్శకత్వం: యువరాజ్ చిన్నసామి.

## 'స్టూడెంట్' మూవీ టీజర్ చూశారా?



దివంగత శ్రీహరి కొడుకు మేఘాంశ్ హీరోగా చేస్తున్న సినిమా 'స్టూడెంట్'. విజేత పరీక్ హీరోయిన్. బెల్లం సిద్ధారెడ్డి నిర్మిస్తున్నారు. బాలు తత్వమసి దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో మూవీ థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే తాజాగా టీజర్ రిలీజ్ చేశారు. దీనిబట్టి చూస్తే.. ఓ స్టూడెంట్ అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చి ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాడనేది స్టోరీలా అనిపిస్తుంది. సరదాగా కాలేజ్ లైఫ్ ఎంజాయ్ చేసే స్టూడెంట్ భాను (మేఘాంశ్ శ్రీహరి).. ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ తరపున పాలిటిక్స్‌లోకి రావడం, అందులో ఉండే ప్రమాదాలను, ఎత్తులు పై ఎత్తులను త్వరగా అర్థం చేసుకోవడం లాంటివి చూపించారు. స్టూడెంట్, రాజకీయాల్లోకి వస్తే ఈ పొలిటికల్ ఆటను ఎలా మార్చేయగలడు అనేది సినిమాలో చూపించబోతున్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967